# మేలుకొలుపు

[తొలిపాలు]

894.8271
VEN

కవిరాజు - కళాప్రపూర్ణ
ండవీటి వేంకటకవి

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY

894.8271
VEN
M-10754

AUTHOR : వెంకటకవి, కొండవీటి

TITLE : మేలుకొలుపు

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

ANDHRA PRADESH OPEN UNIVER

# మేలుకొలుపు

## [తొలిపాలు]

A

పూజ్యశ్రీ
శ్రీ సులోచనమ్మ గారికి
నమస్సుమాంజలులతో సమర్పితము-
— వేంకటకవి —
10-1-'73

కృతికర్త

కవిరాజు - కళాప్రపూర్ణ
కొండవీటి వేంకటకవి

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10754

RIAL LIBRARY
RLA
R I.
No.
754

ప్రకాశకుడు
కొండవీటి చిన్నయసూరి

వలయువారు :
కొండవీటి చిన్నయసూరి
క వి రా జు వీ ధి
నిడుబ్రోలు - P. O.
గుంటూరు జిల్లా

తొలికూర్పు
జనవరి 1973

894.8271
VEN

సర్వస్వామ్యములు
ప్రకాశకులవి

MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.

వెల :
రు. 1-00

శా ర దా ప్రె స్,
పొన్నూరు.

A0UA105B1[illegible]2
c
A0UA105B132

# కృతి

వనితలు పండితు ల్లతలు భారతభూమి నిరాశ్రయమ్ముగా
మనరను పూర్వకాలికుల మాట నటుంచి సులోచనమ్మ మీ
సునిశిత హేతుబద్ధ గుణశుద్ధి సమృద్ధికి శోభ గూర్చుచుం
దెనుఁగు జగాన నూతన ఋతిం గలిగించెను వేంకటేశ్వరా !

ఆసంగూరి మహాపరాధములఁ జేయం జంకులేనట్టి సో
మాసుల్ వ్రాసిన వ్రాఁతవ్రాఁతల నణంపంగల్గె వేమన్న నాఁ
డీ సిద్ధాంతగురుండ వీవవుట నేఁడీ గ్రంథరాజమ్ము నే
నాసం దెచ్చితిఁ బుచ్చుకొమ్ము గుణధుర్యా ! నార్లవంశాగ్రణీ !

— గ్రంథకర్త.



గ్రంథకర్త

# మనవి

మీ మీ తెలివితేటలతో వైజ్ఞానిక ఆర్థికరంగాలలో ముందంజ వేసి మహోన్నతస్థానాన్ని - అగ్రాసనాల్ని అందుకొన్న అగ్రజాతి సోదర సోదరీమణులారా! ధర్మాధర్మాల్ని విచారించండి.

మీ యడుగుజాడల్లో ప్రభుత్వాన్ని నడిపించడానికే ప్రయత్ని స్తున్నారు మీరు. మీ విజ్ఞానమే భారతజాతికి రక్ష, మీ ఆర్థిక సంపదయే భారతదేశానికి పెట్టనికోట, మీరెపుడు దేశమునకు వెన్నె ముకవంటివారు, మీ మాటల బాటలలో, నడువవలసిన దీలోకము- అని మీరు భావిస్తున్నారు. అట్టిమీరు మీ మహోన్నతినే కాక అందరను కనిపెట్టియుండవలసిన సమయ మాసన్నమైంది.

నడుముకట్టి ఈ కార్యరంగంలో నిలిచారు కొందరు స్వార్థ త్యాగులు - పరార్థహితులు. పిలుపులో నిలుపులో అందరు సమానమే అని అంటున్నాయి అన్ని రాజకీయపార్టీలు. అన్నమాట నిలుపుకుందా మని ప్రయత్నిస్తున్నాయి కొన్నిపార్టీలు. ఇందాక ఆచరణలో పెట్ట లేకపోతున్నాయి మరికొన్నిపార్టీలు. కారణాలు తెలియడంలేదు. అగ్రనాయకుల దయాదాక్షిణ్యాలతోగాక దళితజాతులు కన్నుదెరిస్తేనే గాని ఈపని సాధ్యం కాదంటూరా!

అన్నిరంగాల్లో ముందడుగువేసిన మీనుండి మేము గ్రహింప వలసిన విశేషాలు వందలు-వేలు-లక్షలు. మీరుకూడ మా దైన్యప్పు నాదులమీద మేడలుగట్ట ప్రయత్నింపవలదని అవి యెంతోకాలం నిలువజాలవని మీరు గ్రహించాలి. అసలు మాకు ముందుగా కావల సింది విద్య. ఆతరువాత ఆర్థికవనరులు. ఆపిమ్మట మాకు గావలసినవి మానమర్యాదలు - మానవ విలువలు. ఇవే మేము కోరే కోర్కెలు.

ఇందులో ఇవి సబబుకావని వేలుపెట్టి చూపేవారెవరు ? మనిషిగాపుట్టి మనిషిగా బ్రదికి మనిషిగా చచ్చేవారెవరు వీటిని కాదనలేరనుకుంటాము.

ముందుకుపోదామని వెనక్కు నడుస్తున్నట్లుగా ప్రభుత్వంకూడ బలమైన శాసనాలు చేస్తానని చేయలేకపోతున్నది. శాసనాల చెవులు పట్టి ఆడించే సర్కసురాయళ్ళు వేచి చూద్దామంటున్నారు తాపీగా-సర్వజాతి మతసమ్మతమైన సామ్యవాద ప్రభుత్వాన్ని స్తాపిస్తారని సంతోషించి బీదబిక్కిజనము చంకలుగొట్టారు. వెనుకబడినజాతుల వెనుకబడినతనం వెన్నెముక కంటుకొనే మాటిమాటికి చీటికిమాటికి వెక్కిరిస్తుంది. ఇంకెంతకాలం ఈ దుర్భరపరిస్థితి-శిక్ష అనుభవించాలో అడుగునబడ్డ జాతికి అర్థంగావడంలా—

ఒకేతప్పుచేసినా భిన్నభిన్నజాతులకు తరతమ భేదాల్తో శిక్షలు విధించిన వృద్ధమనుధర్మశాస్త్రాలు ఇంకా మచ్చులమీద తొంగిచూస్తూ మామీదికి దుముకడానికి సిద్ధంగా ఉన్నాయి. కలికాలం వచ్చిందనికారు కూతలుకూస్తూ కన్నుమిన్నెరుగక కనులెఱ్రచేస్తున్నారు పలవరిస్తున్నారు కఠిన పాషాణహృదయులు కొందరు - కరుణాదూరులు మరికొందరు.

మా తాతముత్తాతలనుండి మమ్మెన్ని చెరలుపెట్టినా - మరచిపోవడానికే ప్రయత్నిస్తాము మేము. యుగయుగాలనాడు జరిగిన చరిత్రను తిరిగి త్రవ్వబోవడంలేదు. గతంగతం - ఆగతం ఆగతం - అనే విశ్వాసంతోనే దానికై విచారించం. దానివలన మాకేంలాభం రాదనికూడా తెలుసు. తరతరాలనుండి ఆచారమనే మహామారి కాళ్ళ రాపిడికి ఇక తాళలేం - తాళతలుచుకోలేదుకూడా. శాంతినీ దాంతినీ సర్వదా కోరుతూ ! గుండెలూ - పిడికిళ్లూ బిగిస్తాము. అని మనవి చేస్తున్నాము మేము-సెలవు—

—గ్రంథకర్త.

iii

# హెచ్చరిక

జాతీయ సోదర సోదరీమణులారా! మా మనవిని ఆలకించాక మా హెచ్చరికనుగూడా ఆలోచించండి స్వార్థపరులు కల్పించిన శాస్త్రాలకు మనము దాసానుదాసులమై మెలగడం హాస్యాస్పదం; మతిలేనితనంకూడా-ధర్మనిర్వచనమును పరికింపుడు—

శ్లో॥ నైవధర్మీ నచాధర్మీ॥ నచైవహి శుభాశుభీ
యస్స్యా దేకాసనే లీన॥ స్తూష్ణీం కించి దచింతయన్.

భా॥ ప్రశాంతమైన స్థలమున ఒంటరిగా గూరుచుండి ఆలోచనచేసి చూడగా ధర్మము లధర్మములుగా అధర్మములు ధర్మములుగా తోచుచున్నవి - అని శాంకరగీతాభాష్యము - ఇంకను—

శ్లో॥ నచదేవా నపితరో॥ మునయో నచ మానవాః
అయంధర్మో హ్యయంనేతి॥ బ్రువంతోఽభిన్నదర్శనాః
తస్మా న్నసిశ్చయా ద్వక్తుం॥ ధర్మః శక్యస్తు కేనచిత్.

భా॥ దేవతలేకాదు, పితరులేకాదు, మునులేకాదు మానవులేకాదు-ఎవరైనను ఇది ధర్మము-ఇది అధర్మమనిచెప్పలేరు. అందువలన ధర్మనిర్ణయమెవ్వరిచేతకానిపని - అని వాయుపురాణము - అయినను ధర్మనిర్ణయమిట్లుచేయబడెను.

వా॥ ప్రాణినాం సాక్షా దభ్యుదయ నిశ్శ్రేయసహేతు ర్య స్సధర్మః.

భా॥ ఏది ప్రాణికోటికి అభ్యుదయకారకమో, క్షేమదాయకమో అదే ధర్మమని శాంకరగీతాభాష్యము మరియు—

శ్లో॥ ప్రభవార్థాయ భూతానాం ॥ ధర్మప్రవచనం కృతం
యత్ స్యాత్ ప్రభవసంయుక్తః స ధర్మఇతి నిశ్చయః.

భా॥ ప్రాణికోటి పురోభివృద్ధికి ధర్మ ముద్దేశింపబడినది. కాబట్టి ఏది ఆ పురోభివృద్ధిని సమకూర్పజాలునో అదే ధర్మమనుట నిశ్చయము అని మహాభారతము.

శ్లో॥ సర్వేషాం యః సుహృ న్నిత్యం ॥ సర్వేషాం చ హితేరతః
కర్మణా మనసా వాచా ॥ స ధర్మో వేదజాయతే ॥

భా॥ సర్వులకు ఏది అన్యోన్యతను (సుహృద్భావమును) కూర్ప జాలునో ఏది సర్వమానవులకు హితమును సమకూర్పజాలునో అదియే ధర్మమనుట నిశ్చయము - అని మహాభారతము- ఇట్లు మన పెద్దలు ధర్మనిర్వచనము గావించుకొనిరి. అందుకని "వినదగు నెవ్వరుచెప్పిన వినినంతనె వేగపడక వివరింపదగున్" అన్నారు పెద్దలు. ఈ విశ్వాసము మీమీద మాకుంది కనుకనే ఈ హెచ్చరికచేసే అవకాశం-అవసరం మాకు గలిగింది.

మేం వెనుకబడ్డవారం - పెద్దకులాల వాళ్ళతో బలవంతంగా హైందవనాగరకత మా నెత్తిమీద రుద్దబడింది. శాశ్వతంగా మేం సంఘానికి దాసులుగా చేయబడ్డాం. పాదాల్లోపుట్టి పాదాలకడనే నిలిచి పాదాల్తోనలగద్రొక్కబడ్డాం-మాయేడ్పుగొట్టు మొగాలుచూచే- "శోచంతిభిద్యంతి ఇతి శూద్రాః శుచశోకే" అని వ్యుత్పత్త్యర్థమును చెప్పి శూద్రులని మాకు నామకరణం చేసారు. ఇంతకాలం మేం చేస్తున్న దీనాలాపాలేవీ సంఘంలోని ఉక్కుపునాదుల్ని ఏమాత్రం సడల గొట్టేట్లు కనబడడంలేదు. పనిపాటులేని కొన్నికొన్నిజాతులు పూర్తిగా సంఘమర్యాద లందుతూంటే రాత్రింబవళ్ళూ చాకిరిచేసి పరులపొట్టలు

ముడుతవడకుండా తమ పొట్టలు ముడుతవేసుకొంటున్న మరికొన్ని జాతులు నిత్యమూ హైన్యాన్ని అనుభవిస్తున్నాయి. పెద్దలైన బుద్ధిజీవులు ఒకసారి వెనుకబడ్డజాతుల సంఖ్యాబలాన్ని నెమరువేసుకుంటే ఏ స్వతంత్రదేశ జనాభాకంటెను ఏమాత్రం తక్కువగాలేదని తెలుస్తుంది.

అయితే మేమిట్లా అడుగుబట్టడానికి కారణా లేమంటారా సావధానంగా వినండి. ఆనాడేనాడో ఆర్యజాతి దండెత్తి ద్రావిడ దేశంమీదకు వచ్చినప్పుడు మీరు మీవారు వారికి సాయపడ్డారు. మేము మావారు దేశస్వాతంత్ర్యానికి భంగంవస్తుందని మాతృద్రోహం చేయలేకపోయాము. నాటికీ నేటికీ మీరు లొంగదీసారు - మేము కుంగిపోయాము. మీ మీ జాతుల సేవచేస్తూ హీనజాతుల జాబితాలో కెక్కాము. మీయిండ్లలో అడ్డమైనచాకిరీ చేసిపెడుతున్నా - మీఆచారవ్యవహారాల్లో, మీ కట్టుబొట్లలో, మీ తిండితిప్పల్లో మాకెంతమాత్రం భాగస్వామ్యం లేకపోయింది. అలవరుచుకునే అవకాశం కూడా లేకపోయింది. విద్య, విజ్ఞానం, ధనం - తదితర వనరేవి మాకు లేకుండా మీరుచేసారు. కనీసం తిండి - బట్టా, ఇల్లూ-వల్లూ పరిశుభ్రంగా వుంచుకోవడానికి వీల్లేకుండా పోయింది. అథవా యెవరైనా వుంచుకుంటే వారు మీకంటిమంటకు ఆహుతైపోయారు.

ఎంతమంది సంఘసంస్కర్తలు నడుంగట్టినా - ప్రభుత్వం మన అభ్యున్నతికి మహత్తర కార్యక్రమం చేపట్టినా లోడు, గోడు, రోడు, గాడులు మనల్నింకా వదలడంలేదు. కులంచెప్పేటప్పుడు మాలోడు, మంగలోడు, మాదిగోడు, కుమ్మరోడు మొదలైనవి బాహాటంగా నిస్సంశయంగా అంటూనేవున్నారు. మనపేర్లమీద-గాడు డూడూలు నేటికి పూర్తిగా వినపడుతూనే వున్నాయి.

ఈ పేర్ల నిట్లానే పిలవాలని మనువు మొదలుగాగలవారు చెప్పారు.

శ్లో॥ మంగళ్యం బ్రాహ్మణస్య స్యాత్ ॥ క్షత్రియస్య బలాన్వితం
వైశ్యస్య పుష్టిసంయుక్తం ॥ శూద్రస్య తు జుగిప్సితం.
మనుస్మృతి 2 అధ్యా-31 శ్లో-

భా॥ బ్రాహ్మణులకు మంగళవాచకము, క్షత్రియులకు, బలప్రధానము, వైశ్యులకు పుష్టియుక్తము, శూద్రులకు దాసాదిరూపమగు జుగుప్సాకరములగు నామధేయము లుంపవలయును.

శ్లో॥ శర్మవత్ బ్రాహ్మణస్య స్యాత్ ॥ రాజ్ఞో రక్షా సమన్వితం
వైశ్యస్య ధనసంయుక్తం ॥ శూద్రస్య ప్రైష్యసంయుతం-
మనుస్మృతి 2 అధ్యా-32 శ్లో-

భా॥ బ్రాహ్మణునకు శుభశర్మ, క్షత్రియునకు బలవర్మ, వైశ్యునకు వసుభూతి, శూద్రునకు దీన-దాస ఈప్రకారమగు నర్థములుగల నామము లుంచవలయును.— ఎవని కెప్పుడెట్లు పుట్టెనో గుర్తుతెలియని ఈమనువు ఆ యా జాతులవారి నిట్లాపిలవాలని నిర్ణయించాడు. ఆ నియమాన్నే శంఖస్మృతిలో సైతము-

శ్లో॥ నామధేయంచ కర్తవ్యం ॥ వర్ణానాంచ సమాక్షరం
మాంగల్యం బ్రాహ్మణస్యోక్తం ॥ క్షత్రియస్య బలాన్వితం.
2 అ. 2-శ్లో.

శ్లో॥ వైశ్యస్య ధనసంయుక్తం ॥ శూద్రస్యతు జుగుప్సితం
శర్మాంతం బ్రాహ్మణస్యోక్తం ॥ వర్మాంతం క్షత్రియస్యతు
ధనాంతంచైవ వైశ్యస్య ॥ దాసాంతం చాంత్యజన్మనః
2 అ 3-4 శ్లో-

ఇట్లు పెక్కుస్మృతులలో నున్నవి. ఈ అనవాయితిని విడువలేక శ్రీమాన్ బహుజనపల్లి సీతారామాచార్యులు తన ప్రౌఢవ్యాకరణంలో

సూ॥ తెనుఁగునం గొన్ని తత్సమదేశ్య శబ్దములకం కెుం బరంబుగ నేకవచనంబున నీచత్వద్యోతకంబయి యిగాయను నొక్కశబ్దంబును_ దానిపై డువర్ణకాదులునుం జూపట్టెడి; సంబోధనంబున డువర్ణకంబు చూపట్టదు తుదిదీర్ఘంబునకు హ్రస్వంబు వైకల్పికంబు (ప్రౌఢ-అచ్ఛిక-22) ఇచట బాలిగాడు, చిట్టిగాడు - అని ఉదాహరణ లిచ్చారు. ఈ సూత్రాన్ని వ్యాఖ్యానిస్తూ సరసులు, సహృదయులు, విమర్శక శిరోమణులగు స్ఫూర్తిశ్రీయను గుప్తనామముగల శ్రీ టి. భాస్కరరావు గారు కృష్ణగాడు, బాబుగాడు, శర్మగాడు - మున్నగు నుదాహరణ లిచ్చారు. ఇది కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నట్లు సరిపోయినది—

పెద్దకులాలవారు తమతమ కులాలకు గౌరవభంగం కలుగకుండా చూచుకుందామని మనవాళ్ళను లచ్చుంకోటి, రత్తాలు, రాగవులు, సీరాములు, ఈరసామి, కోటిసామి, గంగులు - అని చమత్కారంగా తమాషాగా నేటికీ పిలుస్తున్నారు ఇట్లా పిలిచేవారికి మనం మనవి పూర్వకంగా అయ్యా! అపభ్రంశ పదాలుపలికి మీనోరు చెడగొట్టుకో వద్దని చెబుదాం. మానమర్యాదలు తెలియక పలికే అజ్ఞానులకు వినయ పూర్వకంగా చెబుదాం. తెలిసి పట్టుదలగా బిలిస్తే మనం మనల బిలచినట్లే వారినిగూడా పిలిచి మనసోదరప్రేమను ప్రకటిద్దాం.

తినతిండి, కట్టుగుడ్డ, నిలువనీడ, పండమంచము లేక నిత్యము బ్రదుకుదెరువుకై అడుగడుగునా ఎనలేని బాధలుపడే వెనుకబడ్డజాతులను జూడకుండా డాబుదర్పాలతో - అధికారపదవులతో అందలా లెక్కి తిరిగే సోమరిపోతులముందూ - మతాలపేరుతో, దేవుళ్ళపేరుతో పంచభక్ష్యపరమాన్నాల ముక్కుమునుగ మెక్కుతూ తిరిగే మతా

చార్యులముందూ మనమింకా తలలూపుతూ డూడూ బసవన్నలలాగా తిరిగేదిలేదని గట్టిగా చెబుదాం—

నేడు మనలోగూడా సర్వశ్రీ సర్దార్ గౌతు లచ్చన్న, అనగాని భగవంతరావు, తులాబందుల నాగేశ్వరరావు, ప్రగడ కోటయ్య, యన్. వీరాచారి, వేమవరపు వెంకటేశ్వర్లు మొదలుగాగల రాజకీయనాయకు లెందరో వున్నారు. అట్లాగే సర్వశ్రీ లంకపల్లి బుల్లయ్య, జె. వీరా స్వామి, బి. రామకృష్ణ, కొండా రంగారావు, దేవరపల్లి మస్తానరావు మొదలగు విద్యాసంపన్నులు వందలకొలది వున్నారు. మన మిప్పటి కయినా కన్ను దెరచి ఉన్నతోన్నత పదవులందున్న మన పెద్దలకు జోహారు లర్పిద్దాం. సంఘసేవకులైన పూజనీయులందరకూ హృదయ పూర్వకమైన నమస్సుమాంజలు లర్పిద్దాం. మనలోమనకు విద్వేషాగ్నిని రగులుకొలిపే స్వార్థబుద్ధులకు గుణపాఠం నేర్పుదాం.

-గ్రంథకర్త

— ★ —

# మేలుకొలుపు

## [తొలిపాలు]

సమస్తమును తమవలె చూచుకొను పవిత్ర భారతీయ సోదరులారా! పురాతన దురాచారములచే మీ రెంత చెడిపోయినను సమత మీ హృదయములందు కలదని మా విశ్వాసము. అందువలన మీకు నమస్కారము లందజేయుచున్నాము.

ఒక భరతఖండానమాత్రమే పెక్కు మతాలు, మతకర్తలు - కులాలు కులపతులు పుట్టిరని మనమందర మెరిగిన సంగతియే. మతములలో మతములు, కులములలో కులములు కల్పించి వినోదపడు కార్యక్రమమునకు సర్వేశ్వరుని దృష్టిలో ఈ భారతదేశమే కన్పించినది కాబోలు. ఈ దేశమింత పాపమేలచేసెనో తెలియరాదు.

మనదేశమును వేదభూమియని, పుణ్యభూమియని కొందరు చెప్పుచున్నారు. భగవంతుడు దుష్టశిక్షణార్థము వేలకొలది యవతారము లెత్తవలసివచ్చినది. ఏదేశములోనైనా దేవుళ్ళు ఇన్ని అవతారాలెత్తలేదు. అంటే భారతదేశమొక్కటే దుష్టులకు నిలయమన్నమాట. కనుక దుష్టుల కాలవాలమైన దేశాన్ని ఏమనాలో ఊహించండి. చాతుర్వర్ణ్య వ్యవస్థానమే హిందూమతధర్మమని భవిష్యపురాణములో గలదు.

శ్లో॥ చాతుర్వర్ణ్య వ్యవస్థానం ॥ యత్ర దేశే న విద్యతే
మ్లేచ్ఛదేశం చ తం ప్రాహుః ॥ ఆర్యావర్త స్తతఃపరః.

ఈ నాలుగు కులాలును, ఇందు గలిగిన అనులోమ, విలోమ కులాలునులేని దేశమును మ్లేచ్ఛదేశమని పిలువవలయునట. ఏ మీా ధర్మసందేశము.

తనకంటె హీనులను లేదా హీనజాతులను దూషించుచుండుటయే హిందువుని ధర్మమని హిందూశబ్దవ్యుత్పత్తిని మేరుతంత్రములో తెలిపిరి.

శ్లో॥ హీనంచ దూషయత్యేవ ॥ హిందు రిత్యుచ్యతే ప్రియే
హిందూధర్మ ప్రలుప్తారో ॥ భవేయు శ్చక్రవర్తినః.

ఇట్టి నైచ్యమును విడనాడి మానవులెల్ల రొకటేయని భిన్నముగాదని హెచ్చుతగ్గులు కల్పితములని నిర్ణయించే ప్రయత్నము మాది. వృత్తుల గౌరవాన్ని అభివృద్ధిపరచి ఆ యా వృత్తులు నీచములు కావని మానవుల మనుగడలకు అన్నివృత్తులు హేతుభూతములని ప్రకటించుట మా కర్తవ్యము. కష్టజీవులకు ఉత్సాహమును గలిగించి సంఘశ్రేయమును గోరుట మా ఆకాంక్ష. కులభేదాలు మరింత బిరుసెక్కి తైతెక్కలాడకుండ చూచుట మా ఉద్దేశము.

మాకంటెముందు పూజ్యపాదులు కొందరు విశేష పరిశ్రమము చేసి వేద, ఉపనిషద్, శ్రుతి, స్మృతి, పురాణేతిహాసములనుండి ఇట్టుకదల్పరాని ప్రబలతరమగు తార్కాణములనిచ్చి న్యాయమార్గములు చూపిరి. వారి యడుగుజాడలనే మేమును నడువ ప్రయత్నింతుము.

మన తెనుగుదేశములో వేమన, కందుకూరి, గురజాడ, త్రిపురనేని కవిరాజులు సాంఘిక విప్లవమునకై బహుధా ప్రయత్నించిరి. పై జాతులపై పోరాట మంతసులభముగాదని మనకు తెలిసినదే. అయినను సర్వజాతులు మేలుకొనే సమయ మాసన్నమైనది. ప్రతి దళితజాతుల నుండి మేలుకొలుపులుపాడే వైతాళికులు రావలసియున్నది. ఆ వైతాళికుల కొరకే ఈ మేలుకొలుపు.

శ్లో॥ లోకానాంతు వివృద్ధ్యర్థం ॥ ముఖబాహూరు పాదతః
బ్రాహ్మణం క్షత్రియం వైశ్యం ॥ శూద్రం చ నిరవర్తయత్.

మనుస్మృతి 1 అధ్యా. 31-శ్లో.

సర్వేశ్వరునకు పుట్టవలసినచోటునుండి ఎవరు పుట్టకపోయినను మొగమునుండి బాహువులనుండి, తొడలనుండి, పాదములనుండి నాలుగు జాతులవారు పుట్టిరని మనువు మొదలుగాగల పెద్దలెందరో చెప్పిరి. ఆ సర్వేశ్వరుని మనసునుండి మన్మథుడు - బొడ్డునుండి పద్మము మొలిచి దానినుండి సృష్టికర్తయగు బ్రహ్మపుట్టెనని కులపతులు వక్కాణించుచున్నారు. ఈ చిత్తమునుండి పుట్టిన మన్మథుడు - ఆ బొడ్డునగల తామరనుండి పుట్టిన బ్రహ్మలు ఏ కులమునచేరిరో ఎవరును తేల్చలేదు. ఇట్టి ఈ పుట్టువులలోని గుట్టుమట్టులను మర్మజ్ఞులగు ధర్మజ్ఞులు గ్రహింతురుగాక.

శతపథబ్రాహ్మణమున "పద్యుహవా ఏతత్ శ్మశానం యచ్ఛూద్రః" అని కలదు. పాదములతోగూడిన అనగా మనుష్యాకారమైన శ్మశానమువంటివాడు శూద్రుడు కావున సర్వకర్మముల కనర్హుడని కమలాకరభట్టు పైదాని కర్థవివరణమును గావించెను.

శ్లో॥ కపిలాక్షీరపానేన ॥ బ్రాహ్మణీగమనేనచ
వేదాక్షర విచారేణ శూద్ర శ్చండాలతాం వ్రజేత్.

ఇది పరాశరవచనము. శూద్రుడు నల్లావుపాలు త్రావినను బాపనామెతో సంగమించినను, వేదాక్షర విచారము గావించినను చండాలత్వ మందునని ఈశ్లోకతాత్పర్యము. అసలీ ధర్మమును తెలిపిన పరాశరుడెవడు ? ఇతని పుట్టుపూర్వోత్తములగుట్టు వీనికే తెలిసియున్నట్లు గన్పట్టుదు. దేవవేశ్యయగు ఊర్వశికి మునిమనుమడు. వీని నాయనమ్మ మాతంగకన్యయగు నరుంధతి. ఇతని తండ్రియగు శక్తిముని పుంగనూరుమాదిగ దానిని భార్యగా స్వీకరింప నితడుగలిగెను.

శ్లో॥ గణికాగర్భసంభూతో ॥ వసిష్ఠశ్చ మహాముని:
తపసా బ్రాహ్మణో జాత: ॥ సంస్కార స్తత్ర కారణం.

శ్లో॥ జాతో వ్యాసస్తు కైవర్త్యా: ॥ శ్వపాక్యాస్తు పరాశర:
బహవో న్యేపి విప్రత్వం ॥ ప్రాప్తా యే పూర్వ మద్విజా:
పూర్వగాధాలహరి. .

ఉదాహరణాంతరము-

శ్లో॥ జాతో వ్యాసస్తు కైవర్త్యా: ॥ శ్వపాక్యాస్తు పరాశర:
మహాభారతము-అను శాసనికపర్వము-

గీ॥ వ్యాసముని చంద్రుగన్న పరాశరుండు
మాలదానికిబుట్టి బ్రహ్మర్షియయ్యె - మంగిపూడి వేంకటశర్మ - నిరుద్ధభారతం - ఇతడే పట్టపగలు పల్లెకారిపడుచగు మత్స్యగంధితో

సయ్యాటలాడి వ్యాసునిగన్న గడుసరి. ఇట్టివాడు ధర్మబోధకుడగుట విడ్డూరమేకాక "కలౌపారాశరస్మృతిః" అని ఈ కలియుగమున ఇతని కింత ప్రాధాన్యమును మునులొసగిరి. ఉన్నఋషులలో ఇతడే కొంత మెరుగేమో! విచారింపదగియున్నది. పడివిత్తనమునకు బలమెక్కువ యన్న సామెత వీనివలననే కలిగినదని వృద్ధవాక్యము.

వేదకాలమున విగ్రహారాధనము లేకున్నను ప్రకృతి సమారాధనము గలదు. తదుపరి బుద్ధ, శంకర, రామానుజ, మధ్వ, క్రీస్తు మహమ్మదు, గాంధీలవంటి మహాపురుషులెందరో ఈ అసియాఖండమున పుట్టి వారివారి మతములను ఈ ఖండముననేకాక ఖండాంతరముల సైతము ప్రచారము గావించిరి. సర్వజన సమ్మతములైన తమతమ సిద్ధాంతములను బహుళప్రచారము గావించుకొనిరి. వారివారి సిద్ధవాక్కులు - పవిత్రాశయములు - పవిత్రాచరణములు మన హృదయములను గాఢముగా అకట్టుకొని నాటికి నేటికి నిలువద్రొక్కుకొన్నవి. ప్రభుత్వ శాసనమును ఉల్లంఘించిన ఉల్లంఘింపవచ్చునుగాని కులమతముల కట్టుబాట్లను, ఆచార వ్యవహారములను ఉల్లంఘింప నెవరితరము గాదని మనకిప్పు డర్థమగుచున్నది. సత్యాసత్యముల నిర్ణయించుకొనుటకు విజ్ఞాన మవసరము. ఆ విజ్ఞాన సంపాదనమునకే ఇపుడు జాతులన్నియు శ్రమించుచున్నవి.

ప్రతి దేశమున మనకున్నన్ని కులమతభేదములు లేకున్నను వాదభేదములుమాత్రము కలవు. వాని నన్నిటిని విశదీకరించు అవసరము మాకులేకున్నను కొన్నిటినిమాత్రము దిఙ్మాత్రముగా తెలుపుట అవసరమని మాకు తోచుచున్నది. నేడు ప్రపంచమంతట వ్యాపించిన

క్రైస్తవమతమందు రోమన్‌కథోలిక్, లూథరన్, బాప్తిస్మము మొద లగు పలువిధములగు శాఖలు వెలసినవి. వీరందరకు క్రీస్తువొక్కడే దేవుడైనను మేమెక్కువ మేమెక్కువ యను నిక్కుమాత్రము ప్రత్యేక ముగా వెర్రితలలు వేసినది. ప్రాతనిబంధనమును చదివినవారు - అందును ఆదికాండమును చదివినవారు మతమననిదియా! దేవునియాజ్ఞ ఇట్లుండునా! యని విస్తుపోవకమానరు. ఏవపడవలసినవిషయము లందు పెక్కులుగలవు. జంతుబలులు, గ్రుడ్డినమ్మకములు, పశుత్వమునకు దారితీయు మూఢాచారములు హిందూమతమునకుమించి లెక్కకు మిక్కిలిగా కుప్పతెప్పలుగా ఇందున్నవి.

నూతన నిబంధనములోని క్రీస్తుబోధల నాలకించిన నేడీ సమాజ సంస్కర్తలు, దేశోద్ధారకులు చేయుపనులెప్పుడో చెప్పినట్లు మన కనులకు కట్టినట్లుండును. వీనిలో కొన్నిటిని పరిశీలింపుడు - 1. ఎదురుగా కనుపించు మానవుని ప్రేమింపలేనివాడు కనుపింపని భగవంతు నెట్లు ప్రేమింపగలడు. 2 స్వర్గమున్ను, నరకమున్ను నీ హృదయములోనే యున్నవి. 3. లౌకికుల హృదయము పాషాణముకంటె కఠినము. 4. నీ పొరుగువానిని నీతో సమానముగా చూచుకొనుము. 5. ఒంటె సూదిబెజ్జములో దూరితే దూరవచ్చునేమోకాని ధనమదాంధులు మాత్రము భగవంతుని చేరలేరు. 6. జనవాక్యమే భగవద్వాక్యము. 7. మంచిపనులుచేయుటే అమోఘమైన ప్రార్థన - ఇట్టివి ఆణిముత్తెములవంటి నీతులిందు కోకొల్లలు.

ద్రష్ట, బోధకుడు, తత్వజ్ఞుడు, సంస్కర్త, ఆదర్శమానవుడు అనే పంచవిధమూర్తులతో ఏసుక్రీస్తు మనకు గోచరిస్తాడు. విశ్వప్రేమ, లోకోద్ధరణ, చెడుగుకు ప్రతిక్రియ చేయకుండుట అనే మానవోచిత

క్రియాశ్రయి సంపూర్ణతకూడా క్రీస్తునందు చూపట్టును. భగవత్ ప్రేమ, శరణాగతి, విశ్వాసము అనే ఈ దివ్యగుణత్రయము క్రీస్తులో ఎంత గానో వికసిల్లినవి.

ఇట్టి పవిత్రాశయములకు నేడు క్రైస్తవసంఘమున తావుగలదా! ఇది ఆమతావలంబకు లూహింపదగిన విషయము. జ్ఞానస్నానమని రెండు నీటిచుక్కలు తలపై చల్లించుకొని క్రైస్తవమతమును పుచ్చుకొని తాము జ్ఞానులైనట్లు భావించుకొని తక్కిన మతములవారలను అజ్ఞానులని పిలుతురు. ఇది క్రీస్తుదేవుని మరియొకసారి సిలువవేయుట అని అనదగియున్నది.

అరేబియాదేశములో పుట్టిన మహమ్మదు ప్రవక్త బోధించిన మతమే ఇస్లాంమతము. శాంతి - శరణాగతి అనే భావాలు ఇస్లాములో ఇమిడిపోయాయి. ఈ మహమ్మదు పదుమూడేండ్లు మక్కాలోను పదేళ్లు మదీనాలోను గడపినప్పుడు గేబ్రియల్ అను దేవత అరబిక్కుభాషలో తనకు వినిపించిన సందేశమే ఖురానుషరీఫ్ అని తెలిపెను. ఇది 114 అధ్యాయాలతో 6247 సూక్తులతో సంపూర్ణమవును. అతిపురాతనములైన జొరాష్టరు మతాన్ని - యూదులమతాన్ని మథింపగా సంభవించిందే ఈ మతము. ఈ మతము మహమ్మదు అనంతరము సున్నీలు లేక షేకులు, అని సయ్యదులని రెండుతెగలైనవి. మహమ్మదు కూతురైన ఫాతిమాఅనుయాయులే సయ్యదులయిరి. మధుర భక్తి ప్రభావాన్వితమైన ఈ మహమ్మదీయ మతమే సుఫీమతమైనది.

ఇట్టి మహమ్మదీయమతము కొంతకుగొంత వ్యాపించినదని వచ్చును. మొగలాయి పాదుషాల వత్తిడిచే ఇది మన దేశమున

పెచ్చుపెరిగినది. హైందవ క్రైస్తవ మతములందలి విగ్రహారాధనల చూచి ఈసడించుకొనిన మహమ్మదు ఈ నూతన మతమును సంస్థాపించెను. క్రైస్తవమతమున కిది సోదరప్రాయము. అయినను ఖురానులో క్రైస్తవ మతఖండన మెక్కువగాగలదు. కొన్ని మూఢాచారముల తొలగించుకొని బ్రదుకు భద్రపరచుకొన మునుముందుచూచెను; కాని నేటి పీరుల ఊరేగింపు - ఉత్సవాలు వానికి ప్రాణాచారములు పడిన మ్రొక్కుబడులు చెల్లించిన వ్యాధిబాధలు పోవునని పిల్లలు గలుగుదురని దురభిప్రాయమున చిక్కుట మెచ్చదగిన పనికాదు.

ఎంత పవిత్ర జీవితమును, సత్యధర్మములను మహమ్మదు ప్రవక్త చూపించెనో చూడుడు — 1. విశ్వాసము, సత్ప్రవర్తనము గలవారు ఎవరైనను ముక్తిపొందుదురు. 2. అహంకారమును చంపుకొనుము, 3. ఆర్తులను సేవింపుము, 4. నీధనాన్ని - శక్తిని - సమయాన్ని పేదసాదుల్ని ఉద్ధరించడానికే ఉపయోగింపుము. 5. సంఘములో మగవానికి ఏస్థానంవుందో స్త్రీకిగూడ అస్థానమేవుంది. 6. లోకుల్ని పీడించి క్రూరంగా ప్రవర్తిస్తే తగినశాస్తిని అనుభవింపక తప్పదు. 7. ఇతరులను కష్టపెట్టకపోతే నీకు కష్టముగలుగదు. 8. ప్రేమ, దానము, సేవ త్యాగము అనే నాలుగు పూసలతో జీవితమనే జపమాలను కూర్చుకొన్నవానికి తావళంతోపనిలేదు—ఇత్యాదులు సూక్తులిందు కోకొల్లలు. నేడవి ఆ సంఘమున కానుపించుటలేదు. పైపెచ్చు హింసాయుతచర్యలకు గజ్జెకట్టి కార్యరంగమున దుముకుచున్నది. తమ మతము కాని వారిని కాఫరు (మూర్ఖులు) లని పిలుచు దురాచారముగూడ కలదు. మొన మొన్ననే జరిగిపోయిన బంగ్లాదేశములోని ఘోరకృత్యములే దీనికి తార్కాణములు.

నేపాలదేశపు సరిహద్దులలోనున్న "కపిలవస్తు" వనే నగరములో క్రీస్తుకుపూర్వము 620 లో జన్మించి 543 లో నిర్యాణాన్ని పొందారు బుద్ధభగవానులు. అనాటి వైదికులు దేవుడున్నాడా! అని ప్రశ్నిస్తే ఉంటేనేకేమి ? లేకుంటేనేకేమి ? ఇలాంటి తత్వవిచారంతో వ్యర్థంగా కాలాన్ని వెళ్ళబుచ్చకు ధర్మాన్ని శరణందుమని సమాధానమిచ్చారు. ముఖ్యంగా మనోవాక్కాయ కర్మలవల్ల జనించే దశవిధ దోషాలను మానవులు పరిహరించాలని బోధించారు. అసూయ, లోభం, గుడ్డినమ్మకం, కర్మఫలాన్ని విశ్వసింపకపోవడం ఈ నాలుగు మనస్సుకు సంబంధించిన దోషాలు — అబద్ధాలాడడం. తిట్టడం, వ్యర్థ క్రూర అశ్లీల ప్రయోగాలు ఈ మూడూ వాక్కుకు సంబంధించిన దోషాలు. హింస, దొంగతనం, వ్యభిచారం ఈమూడూ శరీరానికి సంబంధించిన దోషాలు - ఈపది వదలడమే ముఖ్యము.

బుద్ధసూక్తులలో ముఖ్యములైనవానిని పరికింపుడు — 1. ఎవ్వరిని మాటలచేతగాని - చేతలచేతగాని కష్టపెట్టక ధర్మానికి కట్టుబడి యుండుము. 2, తృష్ణాత్యాగమువల్లనే దుఃఖాలు, కష్టాలు తొలగిపోవును. 3. విజయము అసూయకు బీజము - పరాజితునకు సౌఖ్యము లేదు. జయాపజయాలను వదలిపెట్టినవాడే సుఖి. 4. ద్వేషం ద్వేషం వల్ల చల్లారదు. ప్రేమవల్లనే ద్వేషం చల్లారుతుంది. 5. శరీరానికి సోమరితనమున్నూ - పహరావానికి పరాకున్నూ - స్త్రీకి వ్యభిచారమున్నూ - దాతకు పిసినారితనమున్నూ కళంకాలు — ఈ కళంకాల నన్నింటిని మించినది అజ్ఞానం. కాబట్టి మానవుడా! అజ్ఞానాన్ని పారద్రోలి నిష్కళంకుడవుకా - ఇవి బుద్ధసందేశంలో ముఖ్యాంశాలు—

"అహింసాపరమోధర్మః" "మమాత్మాసర్వభూతాత్మా" అను మేలిమాటల తన జీవితమునందు నూటికి నూరుపాళ్ళు పాటించి జీవ కారుణ్యమును ప్రదర్శించిన మహానుభావుడు బుద్ధుడు. అడుగునబడిన జాతులవారిని సముద్ధరింప సమస్తభోగములను విశేషించి అలుబిడ్డలను వీడినవాడీ దివ్యమూర్తి. ఇతని అడుగుజాడల అసియా ఖండమంతయు నడచినది. ఏ మాత్రము ప్రయాణ సౌకర్యములులేని ఆనాడు ఆసేతు హిమాచలము దిరిగి ఆరామములు, పాఠశాలలు, కళామందిరములు నెల కొల్పెను. ఖండఖండాంతరవాసులు తమతమ సిరిసంపదలు వదలి భోగులెల్ల జోగులై లోకకల్యాణమునకు దీక్షాకంకణములు కట్టుకొనిరి. మహారాజ్యమునువదలి పూర్ణసన్యాసమును గ్రహించి లోకము ననుగ్ర హించిన బుద్ధభగవానుడు వారి కాదర్శము.

దుర్వాదముల, దుస్తంత్రముల, దుర్మతముల రూపుమాపిన పుణ్యపురుషులకు ఈ బుద్ధమతము ప్రాణతుల్యము. సొంతమేలునకై కల్పించినవగు విగ్రహారాధనలు, కులభేదములు, ఎచ్చులొచ్చులుగా నున్న అచారవ్యవహారము లానాడు లేవు. సాహిత్యము, సంగీతము, శిల్పము, చిత్రము మొదలగు లలితకళలెల్ల జనులకెల్లర కుపాస్యము. వారువీరని భేదములేక ఎల్లరు సోదరులై మెలగిరి. ధర్మము నాల్గు పాదముల నడచినది. భూమి పైరుపచ్చలతో, ధనధాన్యములతో విల సిల్లినది. దీనినే స్వర్ణయుగమని ప్రజలు చెప్పికొనసాగిరి. అట్టి పవిత్ర మతమును మనదేశమునుండి మాయావాదులగు అద్వైతులు తరిమి వేసిరి. నేడు జపాను మొదలగు విదేశములలో మూడుపూవులారు కాయలై నిలిచియున్నది. ఇచట ఒకటిరెండుమాటలు చెప్పకతప్పదు.

హిందూ దేవాలయముల నాశనమొనర్చిన మహమ్మదీయులంత రించినను ఆ సంతతివారు హిందువులకెంత కంటకముగా నున్నారో ఖండఖండాంతరముల భారత జాతీయనాగరకముద్రను వేసిన బౌద్ధ శిల్పమును ముక్కలుముక్కలుగా నొనర్చిన శంకరమతావలంబకులును మన కట్టివారే. రామాదివిగ్రహముల మసీదుమెట్లకమర్చిన గజనీ మహమ్మదు మనకెంత దూరముగా నుండదగినవాడో నాగార్జున పర్వతమునకు దక్షిణపు దిక్కుగానున్న నారసింహ దేవాలయ ద్వార బంధమునకు బుద్ధదేవుని విగ్రహముల ముఖము, ముడ్డి చెక్కి ద్వార బంధపు కమ్ములుగా చేసిన శాంకరమతస్థుడును మనకంత దూరమున నుండదగినవాడే. రాజులమన్ననలంది నాగార్జున దివ్యక్షేత్రమును దానముగాపొంది బౌద్ధసన్యాసుల తలలను గానుగలలోపెట్టి త్రిప్పి నపుడు స్రవించిన రక్తధారలను కన్నులారగాంచి ఆనందించిన అపర శంకరుడని పేరొందిన శంకరాచార్యుడు మన తరతరములవారికి, కళ లకు ఆగర్భశత్రువనుటలో సందియ మేమాత్రము లేదు.

ఆ పవిత్ర సిద్ధాంతములను అచల పరిపూర్ణపీఠస్థులు, వేమన మొదలుగాగల మహాయోగిపుంగవులు తూచా తప్పకుండ నడచుకొని ప్రచారాను సాగించిరి, ఆ తరువాత అంబేద్కరు మహోదయులు మహాప్రచారము గావించిరి. హిందువుగాపుట్టియు - హిందువుగా మర ణింపనొల్లక తుదకు బౌద్ధమతమున తమకులమువారిని చేర్చి తాను చేరెను. గాంధీమహాత్ముడు "ఈశ్వరఅల్లా తేరేనాం" అని ప్రార్థనలు సాగించినను తమకాదర్శముగా బుద్ధుని - అమతమును తన హృదయ మున పదిలపరచుకొనెను. భారతరత్న జవహరీలాలు నెహ్రూ సర్వదా బుద్ధవిగ్రహమును దర్శించుచు, ఆ సిద్ధాంతమున నడచుచు జీవితమును

గడిపెను. కవిరాజు త్రిపురనేని రామస్వామి బుద్ధప్రార్థనము గావించియే కావ్యారంభము గావించెను. నేడు మన భారత ప్రభుత్వము ఆ బుద్ధచిహ్నమునే భారత జాతీయపతాకముపై ముద్రించినది. శిరసా వహించినది.

ఆదిశంకరుడు బౌద్ధమతగురువుల పాదసన్నిధిని విద్యనభ్యసించి వారి మర్యాదలతో సన్యాసమును పుచ్చుకొని ఆ మతమునే సర్వ ధ్వంస మొనర్చెను. ఇతని కాదర్శప్రాయుడగు కుమారిలభట్టు సైతము బౌద్ధులకడచదివి బౌద్ధుల వారిధర్మముల నాశనముగావించెను. ఈయిరువురు మాయాద్వైతమును నిలిపిరి. గురుద్రోహియగు శంకరుడు వర్ణాశ్రమ ధర్మములను పేరుతో తిన త్రాగ భేదము లేర్పరించెను. స్త్రీశూద్రుల మానవతను మసిచేసెను. సీసపు పునాదులతో ఉక్కు మేడలుగట్టి ఒకకులములోనే ఎక్కువతక్కువలు కల్పించి మీరు మీరీ గదులలో భద్రముగా నుండుడని నియమించెను. తన బ్రాహ్మణజాతి లోనే పలుశాఖలు కల్పించి ఒకరికూడొకరు తినకుండచేసెను. ఇట్లు తక్కిన కులములలో అవాంతరభేదములు పెక్కులు కల్పించెను. మానవజాతికింతటి అపకారము - అపచారము కావించిన మానవుడింకెవ్వడు ఈ ప్రపంచమున పుట్టలేదనిన అతిశయోక్తి ఏమాత్రము కాదు - కానేరదు.

అట్టి శంకరుడు తుదకొకనాడు కాశీపట్టణమునకుపోయి గంగా స్నానమును గావించి విశ్వేశ్వరాలయమునకు వచ్చుచుండ త్రోవలో కుక్కలతో మాలవాడొక డెదురాయెను. అంత శంకరుని శిష్యులు, శంకరుడును తొలగు - తొలగుమని ఆమాలవానినిగద్దించిరి. అపుడా మాలవాడు—

శ్లో॥ అన్నమయా దన్నమయం అథవా చైతన్యమేవ చైతన్యం
యతివర! దూరీకర్తుం వాంఛసి కిం? బ్రూహి గచ్ఛ గచ్ఛేతి.

అని సమాధాన మిచ్చెను. స్వామీ! మనయిరువుర శరీరము లన్నమయములైనవే. ఉభయుల జీవాత్మలొక్కటియే. ఇందు తొలగ వలసినది - అస్పృశ్యమైన దేదియని ప్రశ్నించెను. ఇట అన్నమయ ములు దేహములనుటకు ప్రమాణముల దిలకింపుడు—

1. ఆత్మన ఆకాశః సంభూతః - ఆకాశా ద్వాయుః - వాయో రగ్నిః- అగ్నేరాపః-అద్భ్యః పృధివీ - పృధివ్యా ఓషధయః - ఓషధీభ్యోఽ- న్నం - అన్నాత్ పురుషః - స వా ఏషపురుషోఽన్నరసమయః—

2. అన్నంబ్రహ్మేతి వ్యజానాత్, అన్నాద్ధ్యేవఖ ల్విమాని భూతాని జా యంతే-అన్నేన జాతాని జీవంతి. అన్నం ప్రయత్యభిసంవిశంతి-

ఈపై రొండును తైత్తిరీయోపనిషత్తు ద్వితీయోనువాకము—

3. సర్వప్రతిపత్తి సాధారణం స్థూలదేహకారణంభూతపంచకం విరాట్సం జ్ఞికం అన్నశబ్దేనోచ్యతే - తస్య స్థూలభౌతిక కారణత్వాత్ -
—ఆనందగిరికృతటీకా

4. ఆదిత్యా జ్జాయతే వృష్టిః॥ వృష్టే రన్నం తతః ప్రజాః —శ్రుతి.

విజ్ఞానఖనియగు శంకరుడా సమాధానమును - మానవతను గుర్తించి వెంటనే ఆమాలని పాదములపైబడి—

శ్లో॥ జాగ్ర త్స్వప్న సుషుప్తిషు స్ఫుటతరా యాసంవి దుజ్జృంభతే
యా బ్రహ్మాది పిపీలికాంతతనుషు ప్రోతా జగత్సాక్షిణీ
సైవాహం నచ దృశ్యవస్త్వితి ధృఢప్రజ్ఞాపి యస్యాస్తిచేత్
చాండాలోస్తు సతుద్విజోస్తు గురు రిత్యేషా మనీషా మమ ॥

శ్లో॥ బ్రహ్మైవాహ మిదం జగచ్చసకలం చిన్మాత్ర విస్తారితం
సర్వంచైత దవిద్యయా త్రిగుణయా శేషం మయా కల్పితం,
ఇత్థం యస్యదృఢామతి స్సుఖతరే నిత్యే పరే నిర్మలే
చాండాలోస్తు సతుద్విజోస్తు గురు రిత్యేషా మనీషామమ ॥

శ్లో॥ శశ్వ న్నశ్వరమేవ విశ్వ మఖిలం నిశ్చిత్య వాచాగురోః
నిత్యం బ్రహ్మ నిరంతరం విమృశతా నిర్వ్యాజశాంతాత్మనా,
భూతం భావిచ దుష్కృతం ప్రదహతా సంవిన్మయే పావకే
ప్రారబ్ధాయ సమర్పితం స్వవపు రిత్యేషా మనీషామమ ॥

శ్లో॥ యా తిర్యఙ్నరదేవతాభి రహ మిత్యంతస్స్ఫుటా గృహ్యతే
య ద్భాసా హృదయాక్షదేహవిషయా భాంతిస్వతోఽ
చేతనాః,
తాం భాస్యైః పిహితార్కమండలనిభాం స్ఫూర్తిం
సదా భావయన్
యోగీ నిర్వృతమానసో హి గురు రిత్యేషా మనీషా మమ॥

శ్లో॥ యత్సౌఖ్యాంబుధి లేశలేశత ఇమే శక్రాదయో నిర్వృతాః
య చ్చిత్తే నితరాం ప్రశాంతికలనే లబ్ధ్వా ముని ర్నిర్వృతః,
యస్మి న్నిత్యసుఖాంబుధౌ గళితధీ ర్బ్రహ్మైవ నబ్రహ్మవిత్
యః కశ్చి త్ససురేంద్రవందితపదో నూనం మనీషామమ ॥

అని మనీషాపంచకమును చెప్పి తా నేజాతికి తీరని అపకార మొనర్చి అంటరానివారని యనెనో ఆ జాతిలోజనించిన మాతంగకన్య యను దేవతను కాళిదాసుకువలె ఎల్లవేళల సంస్మరించుచుండెను.

శ్లో॥ మాణిక్యవీణా ముపలాలయంతీం
మదాలసాం మంజులవాగ్విలాసాం ।
మాహేంద్రనీలద్యుతి కోమలాంగీం
మాతంగకన్యాం మనసా స్మరామి ॥

శ్లో॥ మాతా మరకతశ్యామా ॥ మాతంగీ మధుశాలినీ
కుర్యాత్ కటాక్షం కల్యాణీ ॥ కదంబవనవాసినీ.

శ్లో॥ జయ మాతంగతనయే ॥ జయ నీలోత్పలద్యుతే
జయ సంగీతరసికే ॥ జయ లీలాశుకప్రియే. —కాళిదాసు

శ్లో॥ మాతంగమునికన్యకాం ॥ మధురభాషిణీ మాశ్రయే.
—శంకరాచార్యులు

శ్లో॥ జయ మాతర్విశాలాక్షి ! జయ సంగీతమాతృకే
జయ మాతంగి ! చండాలి ! గృహీత మధుపాత్రికే.
—శ్యామలాస్తోత్రము

గీ॥ ఎల్లహిందువులును నుపాసించు దేవ
గణములోపల మాతంగకన్యలేదె
—నిరుద్ధభారతము మ॥ వేం॥ శర్మ

కాశీవిశ్వేశ్వరుడే మాలవాడయ్యెను. అతని వెంటనున్న ఆ నాలుగు కుక్కలే చతుర్వేదములని ఛాందసు లందురు. సర్వేశ్వరుడగు కాశీవిశ్వేశ్వరుడే ఈ మాలజాతిలోనుండ ఇచ్ఛగించినచో పైకులాలలో ఉండుట కాతని కంగీకారము కాలేదని తెలియజెప్పి న్నట్లుదని మా భావన. ఆ వేదములే కుక్కలైనచో వాని కంతకంటె కావలసిన

మహత్త యేమున్నది? ఈ మాలవానితో నుపదేశమందిన శంకరుడు స్వయంభూలింగములుగా - ద్వాదశ జ్యోతిర్లింగములుగా వెలసిన శ్రీశైలాదిక్షేత్రములలో అస్పృశ్యతాదోషమును పోగొట్ట శ్రీముఖము నొకదాని నంపెను. కాశికాపురిలోన విశ్వేశ్వరుని సర్వులు స్వయముగా నభిషేకించుకొను సదుపాయము గల్పించెను. తాను కల్పించిన మాయావరణాంధకారమును మాయింప జ్ఞానజ్యోతిని వెలిగించెను.

సత్యమార్గము ననుసరింప బ్రయత్నించు శంకరుని శ్రమములేక మహాసుఖముగా జీవించుచున్న దుండగీంద్రు సహింపలేక తమపొట్ట కొట్టునని భయపడి కేదారక్షేత్రమున కేదారేశ్వరు దివ్యక్షేత్రములో అంటుదోషమును దొలగింప యత్నించు శంకరుని పర్వతసానువులలో హత్యగావించిరి. వింతలగు కథల నంటగట్టిరి. శంకర నిర్యాణానంతరము వానిగూర్చిన వ్రాత లనేకములు - అందుగొన్ని—

శ్లో॥ తమేవ సమయం దైత్యో॥ మణిమా నప్యజాయత
మనోరథేన మహతా। బ్రాహ్మణ్యాం జారతః ఖలాత్।
ఉత్పన్న స్సంకరాత్మాయం। సర్వకర్మ బహిష్కృతః
ఇత్యుక్త స్సజనై ర్మాతా। శంకరేత్యా జుహావతం॥

ఈ శంకరాచార్యులు బ్రాహ్మణజారిణియం దుద్భవించిన రాక్షస పుత్రుడని మణిమంజరియను గ్రంథమున వ్రాయబడియున్నది.

శ్లో॥ సమయా శ్శపథాచారః॥ కాలసిద్ధాంత సంవిదః
తేషాం మధ్యే సంకరస్తు॥ పూర్వం యో మణిమా న్ఖలః
కాలడీగ్రామజో రుద్ర॥ వరా ల్లోకాన్ విమోహయన్.
స్కాందము-వేదాగమోపన్యాసము-పుట 26.

మణిమంజరి వ్రాతల కుపోద్బలకము స్కాందమునందును గలదు. బ్రదికినపుడు దైవాంశమని చచ్చినపుడు రాక్షసపుత్రుడని తెగవ్రాసిరి. ఇది యెంతదారుణమో పరికింపుడు — ఇది యెంత పీడకలో ఊహింపుడు. ప్రజలముందు కల్లబొల్లి యేడ్పులేడ్చి శంకరుడింక మనకులేడని సాంత్వనవాక్యములతో బహుళప్రచారము గావించిరి. పూజ్యపాదులగు శంకరులే ఇక పదికాలములు జీవించియున్నచో తాను నిర్మించిన వర్ణాశ్రమాచార ధర్మములను మాయమేడను తనచేతులతో తునాతునకలుగా — ముక్కలుచెక్కలుగా చేసియుండెడివారే. ఇందు సందియమేమాత్రములేదు. సర్వుల వైదికుల చేయుచున్నాడనిగదా దయానంద సరస్వతీ స్వాములవారిని శిష్యుడుగాచేరి యొక బ్రహ్మచారి తన పొట్టను బెట్టుకొనెను. కులమతభేదములు చల్లచల్లగా లేకుండ చేయుచున్నాడనికదా గాంధీమహాత్ముని కిరాతకుడగు గాడ్సే ఒకచేత భగవద్గీత మరియొకచేత రివాల్వారు పట్టుకొని వంగి దండమని పొత్తికడుపును జల్లెడతూట్లుగా కాల్చి చంపినది. ఇట్టి ఘోరములు మతోన్మాదులెందరెంద రెన్నిచేసిరో చరిత్రపుటలు త్రిప్పిన కాననగును.

ఎవరు తులసీమాలలు ధరించి శంఖచక్ర చిహ్నములు గలిగి శ్రీహరిని తలంతురో వారెల్లరు శ్రీవైష్ణవులేయని రామానుజాచార్యులు సెలవిచ్చిరి. యోగ్యతాయోగ్యతలు పాటింపక దేవుని నామజపమునకు అందరు తగినవారేయని అష్టాక్షరీ మంత్రమును శ్రీరంగదేవాలయ గోపురమెక్కి పెద్దగొంతుకతో సమస్త జనులు ఆలకించుచుండగా పలికిరి. నీవు మహాపాపివగుదువని - గురుధిక్కారదోషము నీకగునని గురువు మొత్తుకొనుచుండగను - వాపోవుచున్నను - కులమువారలు - మతపువారలు గంగవెర్రెత్తి కాసెకట్టి కత్తిదూసి నిలిచినను తన నిర్ణయమునకు

వీసము వెలితి రానీయనివారు రామానుజాచార్యులువారు. ఆ రామానుజ స్వామి కట్టి పవిత్రాశయమున్నది కనుకనే నేడు అంటరానివారుగా భావింపబడు మాల - మాదిగలు శూద్రులు వైష్ణవులై నేటికి నిలిచి యున్నారు. పన్నిద్దరాళ్వారులలో కొందరు భిన్నభిన్న హీనకులస్థులు గలరు. వారందరు సరిసమానముగా గర్భాలయమునజేరి మూలవిరాట్టున కెట్టి నైవేద్యము - పూజలు జరుగుచున్నవో అట్టి నైవేద్యముల, పూజల నందుచున్నారు.

ఇంత పవిత్రాశయములతో మొదలిడిన రామానుజ మతమున స్వార్థబుద్ధులు - స్వార్థపరులు లెక్కకు మిక్కిలిగా తలయెత్తిరి. కుల భేదముల కల్పించిరి. శృంగారమున కగ్రస్థానమిచ్చి యవినీతిపాలయిరి. వీరిమూలముననే గుడిచేటిది - గుడిచేటివాడను శబ్దములు లోకమున పుట్ట భాగవతజనము ఖ్యాతపాలాయెను. అందువలననే "భ్రష్టా భాగవతాజనాః" అను సూక్తిగలిగెను. వీరే కూసుమతమును గల్పించిరి. ఇట్లు కులభేదము లెన్నిసార్లు అడుగంట త్రొక్కబడినను తిరిగి తిరిగి తలయెత్తి నిలుచుచున్నవి. కుష్ఠ, క్షయరోగములకువలె నివి తాత్కాలికోపశమనము పొందుచున్నను శాశ్వతముగా తొలగిపోవు సూచనలులేవు. ఈ యంటువ్యాధి పోవుటకు నేటి తెలివిగల సంఘ సంస్కర్త లాలోచింపదగియున్నది.

ఆ యా కాలములలో మహోన్నత స్థాయిలోనున్న మత, సిద్ధాంత, కళాఖండములు సర్వము భూగర్భములో లీనమైపోయిన వన్నచో పూర్వులగాథలుకూడ చెక్కుచెదరక నిల్చుటెట్లో పెద్దలగు మీరే ఆలోచింపుడు. బుద్ధసిద్ధాంతము నెంత రూపుమాపినను కాల గర్భమునుండి నేటికిని పొటమరించుచునే యున్నది. శంకరాచార్యుని

అంత్యకాలములోని సమతాతత్వసత్యము నెవ్వరు దిగమ్రింగలేక పోయిరి. రామానుజులవారి కులవిప్లవమును ప్రతివైష్ణవదేవాలయమున నేడు చూచుచున్నాము. ఇట్లే చరిత్రము నెవ్వరు ఏమాత్రము తుడిచి వేయలేరు. ఆ సాహసమునకు దిగినవారు లేకపోలేదు. వారిప్రయత్నములు వ్యర్థములుగాక తప్పలేదు.

ఇట నొక నాయీబ్రాహ్మణ వంశమునుగూర్చిమాత్రము వివరింతుము. ఆ యా రాష్ట్రములం దీజాతివారిని ఆ యా పేర్లతో పిలుచుచుందురు. అందుకొన్ని బెంగాలులో – 1. నాపిత, 2. శీల, 3. చంద్రిక్. 4. చంద్రవైద్యాదులు – ఉత్కళరాష్ట్రములో – 1. భండారి – వీరేపూరి జగన్నాధస్వామికి నైవేద్యమునువండు వంటవారు ఇప్పటికీ నియమముక్కడగలదు. ఆంధ్రరాష్ట్రములో – 1. మంగలి, 2. బజంత్రి, 3. కల్యాణభక్తులు. మహారాష్ట్రములో – న్హావి – ఈ రీతి భాషాభేదములతో వ్యవహారమున నున్నారు.

ఇట్టి సుప్రసిద్ధమయిన నాయీబ్రాహ్మణ శబ్దమందలి ఏకదేశమయిన నాయీశబ్దమును గ్రహించి అరవభాషలో "కుక్క" అను అర్థమున్నదని శౌనకగోత్రోద్భవులుకొందరు సందుగొందులలో వెట్టిమొట్టి కూతలు గూయుచున్నారని – పరిహసించుచున్నారని తెలియుచున్నది. తెలుగులో కుక్కను ఉర్దూలో ఏమందురో తెలిసికొనుడు, అందరటనుండి వచ్చినవారేకదా ! కొంచె మీసూత్రము నాలోచించిన కుక్కలకొడుకులుగాని ప్రాణికోటి లేదందుమా ! హిందూశబ్దమునకు పారసీకభాషలో దొంగయని యర్థము. దీనినిబట్టి హిందువులెల్లరు దొంగలా ! ఇట్టియుదాహరణములు వేనకువేలు గలవు. పరభాషలలో నీచార్థములిచ్చు పదము లనేకములుగలవు.

ఇంతేల మన కావ్యభాషకు - వాడుకభాషకు గల భేదమును నేడు చూడుడు— జన్మభూమియన పుట్టినచోటుగదా! మన మెందుండి పుట్టితిమో ఆ స్థలమునే జన్మభూమియని చెప్పవలయునుగదా! లక్షణా మూలకముగా నేడాయర్థముపోయి దేశమను అర్థము వచ్చుటలేదా! పూర్వమహాకవులెల్లరు బాహాటముగా వాడిన కుదువు - ద్రొబ్బు మొద లగు ధాతువులు నేడు నిందార్థకములకు దారిచూపుచున్నవిగదా! ఇప్పటి కవులంతగా ఈ క్రియల వాడుటలేదు. భారతాదులలో తగవు నకు న్యాయమని అర్థముండగా ఆ శబ్దమే నేడు వివాదమని అర్థమిచ్చు చున్నది. ఇట్టి అర్థపరిణామమును - వికారమును పొందిన శబ్దముల పరమప్రమాణముగా అంగీకరింపక తప్పదా! సహృదయు లెవ్వరీ వికా రమున కంగీకరింప రనుకొందుము.

""క్షురీముండి దివాకీర్తి నాపి తాంతావసాయినః'" ఇది నామ లింగానుశాసనము - 2. కాండ 10-శ్లోకము. ఈశబ్దముల వ్యుత్పత్తులెల్ల మహాదారుణములు. మునుముందు విచారింతము. "అంబష్ఠో వైశ్యా ద్విజన్మనోః" (నామ. శూద్రవర్గు) వైశ్యస్త్రీకిని బ్రాహ్మణునకును బుట్టినవాడు అంబష్ఠుడని దీనియర్థము. తలిదండ్రులు ద్విజన్ములు. అయ్యకులము, అమ్మకులములలో నితడు చేరలేదు.

శ్లో॥ శూద్రకన్యా సముత్పన్నో ॥ బ్రాహ్మణే నతు సంస్కృతః
సంస్కారాత్తు భవేద్దాస॥ అసంస్కారాత్తు నాపితః.

—పరా. 11-అ. 22-శ్లో.

భా॥ శూద్రస్త్రీయందు బ్రాహ్మణునివలనపుట్టి షోడశకర్మలచే సంస్క రింపబడినవాడుదాసుడు-అటులనేపుట్టి సంస్కరింపబడనివాడు మంగలి.

శ్లో॥ వైశ్యాయాం విధినా విప్రాత్ ॥ జాతో హ్యంబష్ఠ ఉచ్యతే
కృష్యాజీవో భవేత్తస్య ॥ తథైవాగ్రే ప్రనర్తకః
ధ్వజవిశ్రావకా వాఽపి ॥ అంబష్ఠాః శస్త్రజీవినః।
వైశ్యాయాం విప్రత శ్చౌర్యాత్। కుంభకారః ప్రజాయతే
కులాలవృత్త్యా జీవేత। నాపితా వా భవంత్యుత
సూతకే ప్రేతకే వాపి। దీక్షాకాలేథ వాపనం
నాభే రూర్ధ్వంతు వపనం। తస్మా న్నాపిత ఉచ్యతే॥
—ఔశనస్మృతి. 31, 32, 33, 34.

భా॥ శాస్త్రోక్తముగా విప్రునివలన వైశ్యస్త్రీయందు జనించినవాడు అంబష్ఠుడు. ఇతనికి వ్యవసాయము, నాట్యము, ధ్వజములు మోయుట, శస్త్రజీవనము అనియు - దొంగతనముగా విప్రుడు వైశ్యకాంత పొందొందిన కుమ్మరిగలిగెను. ఇతడు కుండలు చేయవచ్చును లేదా మంగలిపని చేయవచ్చును. సూతకముల - శ్రాద్ధాదుల దీక్షాకాలముల యందు ఆయుష్కర్మ వీరు చేయవలెను. మఱియు నాభికి పైభాగ మంతయు క్షౌరముచేయువారుగాన వీరికి నాపితులని పేరువచ్చెను. ఇది దీనిభావము. ఒకస్మృతిలోనే ఒకవరుసలోనే పరస్పర విరుద్ధ మెంతగలదో పరిశీలింపుడు—

శ్లో॥ బ్రాహ్మణాత్ వైశ్యకన్యాయాం ॥ అంబష్ఠోనామ జాయతే
—శ్రుతి.

భా॥ వైశ్యకన్యయందు బ్రాహ్మణునివలన పుట్టినవాడు అంబష్ఠుడు.

శ్లో॥ బ్రాహ్మణే నోగ్రకన్యాయాం ॥ అంబష్ఠోనామ జాయతే
సకరోతి మనుష్యాణాం ॥ చికిత్సాం రోగిణామపి
—ఆదిపురాణము.

భా॥ క్షత్రియునకు శూద్రస్త్రీయందు పుట్టినది ఉగ్రయనబడును. అట్టి ఉగ్రకాంతకు బ్రాహ్మణునకు పుట్టినవాడు అంబష్ఠుడు. ఇతనికి వైద్యవృత్తి. ఇట్లు వారివారి కసిదీర అంబష్ఠుని అనేకరీతుల బుట్టించిరి. మరియు – "సచ్ఛూద్రౌగోపనాపితౌ" శూద్రులలో గొల్లలు మంగళ్ళు సచ్ఛూద్రులని మనువుపలి కెను. యజ్ఞకర్మల కుపయోగించెడి గోపోషణ – క్షౌరాదులవలన వీరిరువురు సచ్ఛూద్రులయిరని వ్యాఖ్యానకర్తలు తెలిపిరి.

శ్లో॥ అర్ధికః కులమిత్రశ్చ ॥ గోపాలో దాస నాపితౌ
ఏతే శూద్రేషు భోజ్యాన్నా॥య శ్చాత్మానం నివేదయేత్.
—(మను 8-అ.)

శ్లో॥ శూద్రేషు దాస గోపాల ॥ కులమిత్రార్ధసీరిణో
భోజ్యాన్నా నాపిత శ్చైవ ॥ యశ్చాత్మానం నివేదయేత్.
—(యాజ్ఞవల్క్యస్మృతి)

శ్లో॥ దాస నాపిత గోపాల ॥ కులమిత్రార్ధసీరినః
ఏతే శూద్రేషు భోజ్యాన్నా ॥ యశ్చాత్మానం నివేదయేత్.
—(పరా-11 అ. 21-శ్లో.)

శ్లో॥ నాపితాన్వయమిత్రార్ధ ॥ సీరిణో దాస గోపకాః
శూద్రాణా మప్యమీషాం తు ॥ భుక్త్వాన్నం నైవ దూష్యతి.
—(వేదవ్యాసస్మృతి 3-అ. 55-శ్లో.)

భా॥ ఈ శూద్రులలో దాసుడు, నాపితుడు, గోపాలుడు, కులమిత్రుడు, అర్ధసీరి, ఆత్మనివేదకుడు – ఈయార్వురింట బ్రాహ్మణుడు

భుజింపవచ్చును. ఇందరు స్మృతికర్తలు ఏకకంఠముతో బ్రాహ్మణుడు భుజింపవచ్చు ననగా ముట్టరాదందురేమి ? ఇదియేమిచిట్టకము ? ఇది యేమి పోగాలము ?

అంబష్ఠుడు = సంస్కృతము - విశేష్యము - అకారాన్తః పుంలింగము - మంగలి - అని శబ్దరత్నాకరముసగలదు. అంబ సమీపే తిష్ఠతి- చికిత్సార్థమితి అంబష్ఠః = ష్ఠాగతినివృత్తౌ - చికిత్సార్థము సమీపమందుండువాడని వ్యుత్పత్తి వ్రాయబడినది. అంబష్ఠశబ్దమునుగూర్చి మరి కొంత విచారింతము. "అంబ సమీపే తిష్ఠతి" అని వ్రాసిరికదా! సమీపార్థమున అంబశబ్దము అమరమున కెక్కలేదు.

శ్లో॥ సమీపే నికటాసన్న ॥ సన్నికృష్ట సనీడవత్
సదేశాభ్యాశ సవిధ ॥ సమర్యాద సవేశవత్
ఉపకణ్ఠాన్తి కాభ్యర్ణా ॥ భ్యగ్రా అప్యభితోవ్యయమ్.

—(అమరము. 3-కాండ)

పోనీ చికిత్సార్థమనున దెచటనుండి యెరువుదెచ్చుకొని చికిత్సార్థము సమీపించువాడని యర్థము చెప్పికొనిరో తెలియరాకున్నది. లేదా - కులమతభేదములు గల్పించి జీవించు దుర్జాతికి చికిత్సచేయువాడని యేమైన బుద్ధిమంతు లీయర్థము చెప్పిరేమో!

శ్లో॥ నచర్మణో నరక్తస్య ॥ నమాంసస్య నచాస్థినః
నజాతి రాత్మనో జాతిః ॥ వ్యవహారేణ ప్రకల్పితా.

—(నిరాలంబోపనిషత్తు.)

భా॥ చర్మమునకు జాతిలేదు. రక్తమునకు జాతిలేదు. మాంసమునకు జాతిలేదు. ఎముకలకు జాతిలేదు. ఆత్మకు అనగా జీవునకు జాతి

లేదు. జాతియనునది వ్యవహారమాత్రముగా కల్పింపబడినది - అనిన నిరాలంబోపనిషత్తులోని ధర్మబోధ ఇటునెంతయు మనన మొనరింప దగియున్నది.

అమరమందలి శూద్రవర్గులో వీరిని చేర్చారనే విచారముకంటె అవర్గులో చేర్చిన హీనాతిహీనములగు పనులెల్ల శూద్రజాతివా రొనరింతురనికదా! దేశసేవాధురంధరులయి ప్రజాజీవితమునకు ఆధారభూతులై స్వాములకందరకు బువ్వపెట్టి పోషించి అసాములని - ప్రజలనెల్లర కాపాడి కాపులని - స్వశక్తితో సంపాదించుకొనిన అన్నపానాదులతో బలమునుపొంది భార్యలతో కాపురము చేయువారుగనుక సంసారులని పిలువబడువారిట్టి యకృత్యముల గావింతురా! మన భరతఖండమున పరాన్నము మెక్కి జీవించువారు సంసారు లనిపించుకొనరుగదా!

శ్లో॥ పరాన్నేన తు భుక్తేన ॥ మైధునం యోధిగచ్ఛతి
యస్యాన్నం తస్య తే పుత్రా ॥ అన్నా చ్ఛుక్రం ప్రవర్తతే.
—(శంఖలిఖితస్మృతి. 15. శ్లో.)

భా॥ ఎవడు ఇతరుల బువ్వతిని తనపెండ్లాముతోగూడి సంతానము గనునో వాని అసంతానము అన్నదాతదేగాని వానిదికాదని దీని తాత్పర్యము. ఈ విషయమును గ్రహించినవారగుటచేకాబోలు కొన్ని జాతులవారు సంసారులమని చెప్పుకొనలేరు. సన్యాసులమనియు చెప్పుకొనలేరు. మరియు—

శ్లో॥ అన్నాత్తేజో మనః ప్రాణా ॥ శ్చక్షుః శ్రోత్రం యశోబలం
ధృతిం శ్రుతిం తథాశుక్రం ॥ పరాన్నం వర్జయే ద్బుధః.
—శంఖలిఖితస్మృతి-16.

భా॥ అన్నమువలననే తేజస్సు, మనస్సు, ప్రాణములు, నేత్రములు, చెవులు, యశస్సు, ఓజస్సు, ధైర్యము, శ్రుతము, వీర్యము జీవముగలిగి యుండును; కనుక తెలిసినవాడు పనిపాటులేక పరులకూటిని మెక్కరాదు.

వీరినేమి వారివీరివలె విశ్వబ్రాహ్మణులనుసైతము శూద్రవర్గు లోనే జమకట్టిరి. ఏమిదారుణము? మానవుల మనుగడలకు హేతు భూతములగు ముఖ్యవృత్తులనెల్ల స్వీకరించినది వీరేకదా! ఇంతయేల? ఏగంటముతో తాటాకుపై ఈవ్రాతవ్రాసెనో ఆగంటమును చేసిన వారెవరు? ఆ వ్రాసినవాడు పుట్టినపుడు బొడ్డుగోయు టకుపయోగించు కొడవలిలిక్కిని చేసినవారెవరు? కత్తిపీటనుండి కొబ్బరితురుమువరకు, గంటకాడనుండి గడ్డపలుగువరకు చేసినవారెవరు? తమకు తమవారికి పెండ్లికి తిరునడియాలమగు తాళిబొట్టును చేసి వైదికధర్మమును లేదా హిందూధర్మమును నిలువబెట్టినవారెవరు? విశ్వబ్రాహ్మణులుకాక మరెవ్వరైన కలరా! చిత్రవిచిత్రములగు కథలనెన్ని వీరిగురించి కల్పింప లేదు? ఎన్నైననేమి జనులెల్లరు నిత్యము పూజించు విగ్రహముల ప్రసాదించిన శిల్పిశేఖరుల నవమానించు తలంపుగల్గిన వారి కాపాపము కట్టికుడుపక పోదు.

ఇక నాయీబ్రాహ్మణులపేర్లలో దివాకీర్తి - అంతావసాయిను డను నామము లుంచిరి. మాలవానిపేర్లలో మొదటి దళ్లేయున్నది; కాని ఈ రెండుపేర్లకు వ్యుత్పత్తులుమాత్రము ఉత్తరదక్షిణధ్రువములుగా నున్నవి. దివైవకీర్త్యతే రాత్రౌ క్షురకర్మ నిషేధాదితి దివాకీర్తి - రాత్రి క్షౌరము నిషిద్ధమవుటవలన పగలే పిలువబడువాడు - అని - అందే - దివా అకీర్తన మస్యేతి దివాకీర్తిః - పగలు పుణ్యకాలముగనుక యం

దుచ్చారణలేనివాడు - పగటిపూట నెప్పు డుచ్చరింప దగనివాడని భావము. ఇది చండాలపరముగా నున్నది. ఒకేపదమునకు ఇంతటి విరుద్ధార్థములు. ఒకడు పగటిపూటనే పిలువదగినవాడు- మరియొకడు పగటిపూట పిలువదగనివాడు- ఇచ్చు పదజాలముల సృష్టించినవారి తలలు లోకకల్యాణమున కాసింపక ఇంత నైచ్యానుసంధానము లయ్యేనేయని కొందరు పెద్దలందురు. పగటిపూట పలుకదగిన పలుక దగని ఈ పదముల ఆ రచయిత - దీని జదువువారు ఎపుడు చదువ వలయునోకదా!

ఇక అంతావసాయినుడు - అంతే అవసాతుం శీల మస్య అంతావసాయీ = కడపటనుండు స్వభావముగలవాడు. అన్తే గ్రామాన్తే వసతీతి అంతేవాసి = గ్రామము కడపటనుండువాడు అని చండాలుని పరముగా వ్యుత్పత్తిని వ్రాసిరి. ఈవిషయమునే—

సూ॥ అంత్యః పాపిష్ఠః = గౌతమధర్మసూత్రములు 4-27 అనియు మరియు—

> శ్లో॥ చండాల శ్వపచానాంతు । బహిర్గ్రామాత్ ప్రతిశ్రయః
> అపపాత్రాశ్చ కర్తవ్యా । ధనమేషాం శ్వగర్ధభం
> వాసాంసి మృతచేలాని, భిన్నభాండేషు భోజనం
> కార్ష్ణాయ సమలంకారః । పరివ్రజ్యాచ నిత్యశః ॥
>
> —మను. 10 అ. 51,52

భా॥ చండాల, శ్వపాకులకు గ్రామమువెలుపలనే నివాసము. వీరు పాత్రరహితులుగా చేయదగుదురు. ఏ లోహాదిపాత్రలు వీ రుపయోగింతురో అవి మరల సంస్కరించినప్పటికి వ్యవహారమున కుపయోగింప

రాదని వ్యాఖ్యాతలభావము. కుక్కలు గాడిదలుమాత్రమే వీరిధనము. శవములమీది చినిగినబట్టలే వీరికివస్త్రములు. పగిలిన కుండలయందు అనగా పెంకులలోనే వీరు తినవలెను. ఇనుపసొమ్ములే వీరి యలంకారములు. ఎల్లప్పుడు దేశములు దిరుగుట వీరి స్వభావము. ఈ శబ్ద వ్యుత్పత్తులు- వీరి జీవిక లిట్లున్నవి.

అగ్రకులములలోవలె వీరిలో మొదలు మాల - మాదిగలను శాఖలు రెండేర్పడినవి. అందు మాలవారిలో ముఖ్యమైన తెగలు— 1. రెడ్డిభూమివారు, 2. పాకనాటివారు, 3. సరిండ్లవారు, 4. దాయిండ్లవారు. ఈ పైనాలుగు తెగలలో రెడ్డిభూమివారు 16 భాగములుగా పాకనాటివారు 11 భాగములుగా సరిండ్లవారు 17 భాగములుగా దాయిండ్లవారు 8 భాగములుగా చీలిరి. ఇపుడు మాలవారిలో 52 తెగలున్నట్లుగా తెలుస్తుంది. ఇక మాదిగవారిలో – 1. గంపదొంతివారు, 2. జిన్న లేక తల్‌దొంతివారు, 3 భూమిదొంతివారు, 4. చాట్లదొంతివారు, 5. సిచ్చదొంతివారు, 6. చంద్రపదొంతివారు- ఈ అర్ధురేకాక ఇంకా వీరిలో 22 ఉపతెగలున్నట్లు తెలుస్తుంది. ఇట్టి యుభయకులములను నాపిత - పుల్కస శబ్దములచేతను అంటరానివారినిగా చేసిరి.

వీరేకాక శాశ్వతముగా అంటరానిజాతులు మరికొన్నికలవు.

శ్లో॥ రజక శ్చర్మకారశ్చ । నటోబురడ ఏవచ  
కైవర్త మేద భిల్లాశ్చ । స్వర్ణకారశ్చ సౌచికః  
తక్షక స్థిలమంత్రీచ ॥ సూనశ్చ క్రీతధాధ్వజః  
నాపితః కారకశ్చైవ । షోడశైతే జనంగమాః ॥

—శూద్రకమలాకరము.

భా॥ చాకలి, మాదిగ, అటకాడు, మేదర, జాలరి. మేదుడు, బోయ, కంసాలి, కుట్టుపనివాడు, వడ్రంగి, నువ్వులగానుగవాడు, కటికవాడు, క్రీత, ధాధ్వజుడు, మంగలి, కారకుడు - ఈ పదారుగురు అంటరానివారు.

శ్లో॥ కులట శ్చిత్రకర్మాచ ॥ వార్ధుషి శ్చర్మవిక్రయీ
భిషక్చ రజక శ్చైవ ॥ రూపాజీవీచ సూచికః
సౌనికో వర్ణిక శ్చైవ ॥ నిషాదేన సమాః స్మృతాః.
—పరాశరమాధవీయము.

భా॥ వ్యభిచారము, చిత్రకళ, వడ్డివ్యాపారము, చెప్పులుకుట్టుట, వైద్యము, బట్టలుతుకుట, లంజెరికము, కుట్టుపని, కసాయి, రంగుల అద్దకము ఈ వృత్తులచే జీవించువారెల్లరు చండాలురతో సమానులు - కాన వీరు అంటరానివారు.

శ్లో॥ రజక శ్చర్మకారశ్చ ॥ నటో బురడ ఏవచ
కైవర్త మేద భిల్లాశ్చ ॥ సప్తైతేఽంత్యజాః స్మృతాః॥
—మితాక్షరి.

భా॥ చాకలి, మాదిగ, నటుడు, మేదర, చేపలపట్టువాడు, మేదుడు, భిల్లుడు. ఈ యేడుగురు అంత్యజులని తలపవలెను. వీరును అంటరానివారు. ఇట్లు హేమాద్రి ప్రాయశ్చిత్తకాండమునందును ఈ పై జాతులు అంటరానివనికలదు. మరియు అభినవదండియగు కేతన రచితమైన విజ్ఞానేశ్వరీయమునందును అంటరానివారిని దెలిపెను.

ఆ॥ వె॥ చాకి, బోయవాడు, జలగరి, గొడగరి,
కుక్క, సూనగాడు, కోడి, పంది,

బొడ్డుక్రిందియంగములు విప్రుసోకిన
నచటు గడుగవలయు నంద్రుబుధులు.

బ్రదుకుదెరువుకై అనేకులను దేవతలగా, దైవములుగా సృష్టించి వారికి మంత్రవేత్తలమనుకొను కొందరుపెద్దలు ప్రాణప్రతిష్ఠలు గావించిరి. ఆ నోరులేని దేవతలనెల్ల శూద్రవర్గులో చేర్చిరి. మంత్రాధీనులై అనాథలై మెలగువీరు కనులప్పగించి చూచిరి.

శ్లో॥ ప్రతిమానం ప్రతిబింబం । ప్రతిమా ప్రతియాతనా
ప్రతిచ్ఛాయా ప్రతికృతి । రర్చాపుంసి ప్రతినిధిః
—అమరము శూద్రవర్గు.

ఇట్లే దేవుళ్ళను శూద్రవర్గులో జమకట్టుటయేకాక "ప్రతిమా అల్పబుద్ధీనాం" అని వక్కాణించిరి. విగ్రహారాధన మల్పబుద్ధులకు మాత్రమేయనికదా దీనియర్థము. దేవుళ్లకు గుడిగోపురాలను పేరుతో నిత్యనైవేద్య దీపధూపదానాదులను పేరుతో అమాయకుల నోళ్ళు గొట్టి సుఖతమముగా జీవించువారు ఇందలి సత్యాసత్యముల వెల్లడింప గోరుచున్నాము.

దివాకీర్తి - నాపిత శబ్దముల ప్రకారము బజంత్రీలు అంటురాని వారైనచో పవిత్రమగు ఆయుష్కర్మను వారిచే చేయించుకొననేల? ఉపనయనము మొదలు యజ్ఞయాగాది క్రతువులవరకు సర్వకర్మములు నాయీబ్రాహ్మణులు లేనిదే బ్రాహ్మణకార్యములు దీరవే? తలిదండ్రులు మొదలగువారు మరణించినపుడు తలదుడుపులుగానిదే మృతాశౌచములు మాయవే? ఇంతయేల! వితంతువుల తలలు దిగదుడుపులు చేయనిదే వారు శ్రాద్ధాది సర్వకార్యముల కుపయోగపడరే! ఈ విధి

విధానమును పెద్దలు గ్రహింపగోరుచున్నాము. ఈ కల్యాణభక్తులను గూర్చి జాతి మత శూన్యుడై పరిపూర్ణతత్వమును దానైయున్న పరమ యోగి శిఖామణియగు వేమన ఋషీంద్రులు సెలవిచ్చిన విధమును బరికింపుడు

ఆ॥ వె॥ సకలతీర్థములను సకలయజ్ఞంబుల
తలలుగొరగకున్న ఫలము లేదు
మంత్రజలముకన్న మంగలిజల మెచ్చు
విశ్వదాభిరామ వినురవేమ.

తమవృత్తిని వీడక నిలుచువారి నెల్లర వేమన అభినందించెను. తమతమ వృత్తులవిడిచి మానమర్యాదల మంటగలిపి చేయరాని పనుల జేయుచు మే ముత్తమకులసంజాతుల మనుకొను వారిగూర్చి వేమన యోగి పలికిన పలుకుల దిలకింపుడు

ఆ॥ వె॥ జాతివారలెల్ల జాతివిద్యలు నేర్చి
జాణలైరి మరియు జగతిలోన
బ్రాహ్మలైనవారు బ్రహ్మవిద్యెరుగరు
విశ్వదాభిరామ వినురవేమ.

ఇట్లు సమాజమునగల దోషములనెల్ల తూర్పారబట్టిన యోగి వేమనకూడ వీరిని పల్లెత్తుమాట అనలేదు. అయినను సుమతిశతకమున మాత్రము—

కం॥ మేలెంచని మాలిన్యుని
మాలను నగసాలివాని మంగలి హితుగా
నేలిన నరపతిరాజ్యము
నేలగలసి పోవుగాని నెగడదు సుమతీ!

మాలవానిని, అగసాలివానిని, మంగలివానిని స్నేహితునిగా పరిపాలకులెవ్వరు భావింపరాదని - అట్లు భావించినచో వానిరాజ్యము నేలపాలవునని దానిభావము - ఈ పై మూడుజాతులవారి మైత్రితో ఎక్కడ ఏ రాజ్యము నేలపాలయిపోయినట్లు చరిత్ర తెలుపుటలేదుగాని చాణుక్యుని మైత్రితో నందసామ్రాజ్య మంతరించినట్లు - దైవభక్తితో - బ్రాహ్మణయుక్తితో కొండవీటిసామ్రాజ్య మంతరించినట్లు చరిత్ర స్పష్టముచేయుచున్నది. ఇట్టి ఘోరనిందల కీమూడుకులములే హేతుభూతములనుట మహాపచారము. ఈ జాతులపై ఇంతద్వేషమున కేమి హేతువో తెలియవచ్చుటలేదు.

ఈరీతి కులద్వేషములకు గురియై పరస్పరము నిందించుకొనుటలో సబబేమాత్రము లేదు వారువీరనలేల శ్రీవైఖానస బ్రాహ్మణులను (నంబులను) శ్రీశైవబ్రాహ్మణులను (తంబళులను) గురించి వ్రాసిన వ్రాతలు భరింపశక్యమగునా!

శ్లో॥ విప్రాత్ క్షత్రియకన్యాయాం ॥ ఉత్పన్నో రాక్షసేన యః
నామ్నా వైఖానస స్తస్య ॥ వృత్తి ర్విష్ణోశ్చ పూజనం.

—జగద్వల్లభాదిశాస్త్రము.

భా॥ క్షత్రియకన్యయందు బ్రాహ్మణునివలన రాక్షసోద్వాహముచే జనించినవారు వైఖానసులు - వీరివృత్తి విష్ణుపూజనము.

శ్లో॥ వ్రాత్యాత్తు జాయతే విప్రాత్ ॥ పాపాత్మా భూర్జకంటకః
అవంత్యవాటధానౌచ ॥ పుష్పధశ్శైక ఏవచ.

—మను. 10-అ. 21-శ్లో.

భా॥ వ్రాత్యుడగు బ్రాహ్మణునకు బ్రాహ్మణస్త్రీయందు పుట్టినపాపాత్ముడు భూర్జకంటకుడనబడును. వీరు అవంత్యవాటధానపుష్పధశైఖులను దేశములందు ఆపేర్లుగలవారగుదురు.

శ్లో॥ ఏతైస్తు జీవనార్థాయ ॥ కార్యం విష్ణ్వాదిపూజనం.

— విశ్వంభరశాస్త్రము.

వీరికి విష్ణువు మొదలగు దేవాలయములందు పూజావిధులు చెప్పబడినవి.

శ్లో॥ ద్వితీయేనతు యఃపిత్రా ॥ సవర్ణాయాంతు జాయతే
అవావట ఇతిఖ్యాత ॥ శ్శూద్రధర్మా సజాతితః.

— దేవలవచనము.

భా॥ అన్యపత్నియగు సవర్ణస్త్రీయందు రెండవతండ్రిచే పుట్టింపబడినవాడు అవావటుడనబడును అతడుజాతిచే శూద్రధర్మముగలవాడగును.

శ్లో॥ వ్రతహీనా న సంస్కార్యా ॥ స్వతంత్రాఽసుచయే సుతాః
ఉత్పాదితా స్సవర్ణేన ॥ వ్రాత్యాఇవ బహిష్కృతాః.

— దేవలవచనము.

భా॥ స్వతంత్రలగు సవర్ణస్త్రీలయందు అన్యునిచే పుట్టింపబడిన పుత్రులు వ్రతహీనులుగావున సంస్కరింపదగరు. వ్రాత్యులువలె బహిష్కృతులు గాదగుదురు.

శ్లో॥ బ్రాహ్మణా ద్విప్రకన్యాయాం ॥ చౌర్యా జ్జాత శివద్విజః
అధీత్యాగమ శాస్త్రాణి ॥ నిత్యం కుర్యా చ్ఛివార్చనం.

— తాంత్రికమీమాంస.

భా॥ బ్రాహ్మణకన్యయందు బ్రాహ్మణునివలన దొంగచాటుగా పుట్టింపబడినవాడు శివబ్రాహ్మణుడు. ఇతడు ఆగమముల, శాస్త్రముల నేర్చుకొని శివార్చనము గావింపవచ్చును.

శ్లో॥ నీచా విప్రేషు కథితాః । పురా శంకరశాపతః
లోకే దేవలకాస్సర్వే ॥ యజనాధ్యాపనాదిషు
దానే నధికృతాశ్చైతే । శివనిర్మాల్యభక్షకాః
అపాంక్తేయా అభోజ్యాన్నా । స్తథాపయజనాశ్చతే ॥
—తాంత్రికమీమాంస.

భా॥ ఈలోకమున అర్చకులెల్లరు పూర్వము శంకరుని శాపమువలన బ్రాహ్మణులలో వీరు నీచులుగా చెప్పబడిరి. శివనిర్మాల్య భక్షకులైన వీరు పంక్తిబాహ్యులు - తినదగని భోజన పదార్థములుగలవారై యున్నారు.

శ్లో॥ పరదారేషు జాయంతే ॥ పతితాః పుత్రకాః కలౌ
చండాలా ద్విప్ర జారిణ్యాం ॥ శైవ స్సస్యా ద్విజబ్రువః.
—జగద్వల్లభధర్మశాస్త్రము.

భా॥ కలియుగమందు పతితులనువారు జాత్యంతరులచే పరదారల యందు కలుగుచుందురు. అందు బ్రాహ్మణజారిణియందు పంచముని వలన కలిగినవానిని ద్విజాధముండగు శివబ్రాహ్మణుడందురు - ఇవియే కాక వీరిని గూర్చినవి స్మృతిరత్నాకరము, స్మృతిముక్తాఫలమను గ్రంథముల నెట్టి వెన్నియో కలవు. వానినెల్ల నేర్చికూర్చి శ్రుతిధర్మసంజీవని అనుపత్రికయందు యడవల్లి శంకరసోమయాజులు, రామనరసింహశాస్త్రి గారును దండయాత్రచేయగా వైఖానసకులతిలకులగు శ్రీమాన్ వేదాంతం శ్రీనివాసాచార్యులువారు పైవారి యుక్తులనెల్ల ఖండించిరి.

అంతియకాక నంబితంబళచరిత్రము అను గ్రంథమును రచించిరి. "నేడు శూద్రులని వ్యవహరింపబడుచున్నవారిలో తెలగయను ఒకశాఖవారు గలరు. ఈశాఖ చాలపురాతనమైనది. శంకరాచార్యులవారికాలమున నీ తెగవా రధికసంఖ్యాకులుగను, సమస్తబలసంపన్నులునై యుండిరి. అందువలన వీరిలో కొందరి నాయన తనమతములో చేర్చికొని తెలగ నాణ్యులని పేరిడి ద్విజులుగ నంగీకరించెను. ఈ విషయమును శంకర శిష్యులొకరు "పాదజద్విజప్రవృత్తి" అను తమ గ్రంథమున వివరముగ వ్రాసియున్నారు.

—శ్రీమాన్ వేదాంతం శ్రీనివాసాచార్యులవారిచే
రచింపబడిన నంబితంబళ చరిత్రలో ౫-వ పుట.

ఇది చూడదగిన గ్రంథరాజము. ఇక శివబ్రాహ్మణులులలో పూజ్యపాదులగు శ్రీమత్సకలాగమసారగ్రాహి - శ్రీమదో్బధానంద సర స్వతీయతీంద్రులవారు 1927 సం॥ బ్రాహ్మణస్వరూపకథనము అను గ్రంథమును ప్రథమ ద్వితీయభాగములుగా రచించి ముద్రింపించిరి. ఈ సంకరజాతివాదమున కెదురొడ్డి నిలిచిరి.

ఇట్లే మాన్యమహోదయులగు నందిరాజు లక్ష్మీనారాయణ దీక్షితులువారును జంధ్యాల విశ్వపతిశాస్త్రులవారును నియోగివైదికుల పక్షములు వహించి పోరాడుకొను సమయమున ముందుగా విశ్వపతి శాస్త్రిగారు రేపల్లె జమీందారుగారగు జగ్గన్నారావుగారి సమక్షమున శ్రీ నందిరాజువారిని పరికించి మీనియోగికులస్థులకు గృహనామములు సంజ్ఞానామములును రాజశబ్దముతోనుండుటకు కారణము—

శ్లో॥ పురా క్షత్రియవర్గేషు ॥ వినాశే భార్గవాసరే
తత్కన్యాకాలసంభూతా ॥ విప్రేభ్యశ్చ నియోగినః.

భా॥ పరశురాముడు క్షత్రియులనెల్ల చంపినమీదట అరాజకాంతలకు తత్రత్యులగు విప్రులకు బుట్టినవారు నియోగులు - అని అవహేళనము గావించిరి. అంతట మాన్యశ్రీ లక్ష్మీనారాయణ దీక్షితులువారు మీ వైదికులకు నామాంతమున భట్టుశబ్దముండుటకు గారణము.

శ్లో॥ భట్టినీషు తథాజాతా॥ విధవాసుత వైదికాః
అతఏవహి తేషాం స్యాత్ ॥ భట్టుశబ్దప్రభాతథా.

భా॥ వితంతువులగువారికి భట్టుమూర్తులవలన జనించినవారు వైదికులు అకారణముచే మీ నామములచివర భట్టుశబ్దము విరాజిల్లుచున్నది- అని ప్రత్యుత్తరమొసగిరి. ఈ వివాదకాలమున పరస్పరము సంకరజాతులని శాస్త్రసమ్మతవాదముల గావించుకొనిరి. అటునిటు ఉద్దండ పండితులు కోపులుగాసిరి. ఆనాటి ఆగ్రంథసంచయము చూడదగినది. విద్యాగంథముగల జాతులగుటచే ఎదురొడ్డి నిలువగలిగినవి. నోరులేని జాతులేమి చేయగలవు? ఋషులనుండి సర్వులు సంకరజాతులేకదా! సంకరజాతులని చెప్పికొనుట ఆనాటివారికి గొప్పతనమేమో?

ఒకే యొక బ్రహ్మనుండిగాని లేదా - శ్రీమన్నారాయణునుండిగాని స్థానభేదములతో పుట్టువునందినవారేగదా ఈ నాలుగు జాతులవారు. తలలేని పాదములు - పాదములులేని తల నిష్ప్రయోజనము. ఈ మార్గమును మనమనుసరించినచో జాతులెల్ల అయోనిసంజాతములై సోదరత్వమును గోరుచున్నవి. దైవములు, గురువులు, పెద్దలు పూజింపదగినవారు; అందును వారిపాదములు మిక్కిలి పూజార్హములు. అట్లు పరమపూజనీయములగు పాదములబుట్టినశూద్రాదులునుభక్తిప్రపత్తులతో పూజింపదగినవారని పెద్దలందరు. విష్ణుపాదోద్భవయై శివుని తలపై

అధివసించిన గంగాభవానిని స్మరించి, దర్శించి, స్నానమాచరించి భారతీయులెల్లరు సమస్త పాపములనుండి విముక్తులగుచున్నారుగదా! అరీతిగానే పాదోద్భవులసైతము సేవించి భారతజాతి పవిత్రమగుగాత! పురాతన వికృత సిద్ధాంతములతో హిందూమతము పతనోన్ముఖమైన దని యెల్లవారు గ్రహింతురుగాత—

సకలజాతులవారు తమయిండ్ల గడపపచ్చచేసికొను సమయము లందెల్ల ముఖ్యావసరమగునది శుభప్రదమగునది సంగీతము. మానవు లకేకాదు పశుపక్ష్యాదులకు విశేషించి క్రూరసర్పములకు సర్వప్రాణి కోటికి మహానందము నిదియేకదా కూర్చునది. ఇంకను జీవజాలముల కెల్ల అవసరమగునది వైద్యము. అందును శస్త్రవైద్య మత్యంత ప్రశ స్తతరమైనది. "అంబష్ఠానాం చికిత్సనం" అని మనుస్మృతి. అంబష్ఠు లకు శల్యశాలక్యాది చికిత్సావృత్తి ముఖ్యమైనది. ఇట్టి ఆయుర్వేదము, శస్త్రవైద్యము, సంగీతము మొదలగు లలితకళలు నాయీబ్రాహ్మణ వంశమువారివని శ్రుతి, స్మృతు లుద్ఘోషించుచున్నవి. ద్విజన్మలగువారు యజ్ఞయాగాది క్రతువుల నొనర్చునపుడును - ఎల్లవారు మృతాశౌచ విముక్తులగునపుడును ఆయుష్కర్మము మిక్కిలి ముఖ్యము. ఇట్లు సర్వ ప్రాణికోటికి హితులుగా పరిగణింపబడు బజంత్రీలు అస్పృశ్యులనుట తిన్నయింటికి వాసాలు లెక్కపెట్టు కృతఘ్నులనుటలో సందేహమే మాత్రములేదు

శ్లో॥ క్షత్రియ వైశ్య శూద్రాణాం ॥ గోత్రంచ ప్రవరాదికం
తథాన్య సంకరాణాంచ ॥ ఏషాం విప్రాశ్చ యాజకాః

—అగ్నిపురాణము

భా॥ రాజులకు, వైశ్యులకు, శూద్రులకు మఱియు సంకరజాతుల వారి కెల్లరకు పురోహితుల గోత్రనామము లుంపదగును. ఇది అగ్ని పురాణకర్త ఆదేశము - అనుమతి. దీనిప్రకారము ఋషిగోత్రము లుంచుకొనబోవుముందు ఋషుల పుట్టువులు విచారింతము.

తర్హి జాతిర్బ్రాహ్మణ ఇతి చే త్తన్న, తత్ర జాత్యంతరే ష్వనేకజాతి సంభవాత్ - మహర్షయో బహవ స్సంతి. ఋష్యశృంగో మృగ్యాః - కౌశికః కుశాత్ - జంబూకో జంబుకాత్ - వాల్మీకో వల్మీకాత్ - వ్యాసః కైవర్త కన్యాయాం - శశపృష్ఠాత్, గౌతమః - వసిష్ఠ ఊర్వశ్యాం - అగస్త్యః కలశేజాత ఇతి శ్రుతత్వాత్ - ఏతేషాం జాత్యా వినాప్యగ్రే జ్ఞానప్రతిపాదితా ఋషయో బహవస్సంతి తస్మా న్న జాతి ర్బ్రాహ్మణ ఇతి -

—వజ్రసూచికోపనిషత్తు.

దీనిభావమునే తిరునగరి రామానుజసూరిగారు సీసపద్యముగా రచించిరి

సీ॥ వేశ్యాకుమారుడై వెలయు వసిష్ఠుండు
శ్వానీసుతుండైన శౌనకుండు
కైవర్తకన్యకు గలిగిన వ్యాసుండు
చిలుకకుబుట్టిన శ్రీశుకుండు
హరిణీతనూజాతు డవు ఋష్యశృంగుండు
శబరుడౌ వల్మీకసంభవుండు
రజకీసుతుడగు నారదయతిచంద్రుండు
క్షత్రియకులుడైన కౌశికుండు

వర్తనముచేత బ్రాహ్మణత్వంబుగాంచి
పౌరులకు గోత్రకర్త లైనారుగాదె
గంగపురవాస! కల్యాణకరవిలాస!
రాగపూరితసద్భావ! రామదేవ!

(రామదేవశతకము 40–ప)

తమతమ వంశకర్తలగు మహర్షుల జన్మవృత్తాంతము లింత నీచాతి నీచముగ కల్పించినవారలకు తమకు భిన్నముగా నిలచిన జాతులపై అంభాడములు కల్పించుటొక లెక్కా! పక్కా!

నేటి దేశచారిత్రకులలో పరమప్రమాణభూతులైన నదియ కాలేజి ప్రిన్సిపాలుగారగు శ్రీ యోగీంద్రనాథ భట్టాచారి **M. A.,** గారు రచించిన "హిందూకాస్టు అండ్ ట్రయిబ్సు" అను గ్రంథము నందు "పంజాబు నాయీవర్ణమువారు యజ్ఞోపవీతముల ధరించుచుందురు. వారు పవిత్ర జాతీయులుగా తలంపబడుచున్నారు. వారిచేతి నీరందరును త్రాగుటయేకాక వండినవంట అనగా పప్పు - అన్నమును తినుచున్నారు. పంజాబునందు యాజకనామముగల నాయీబ్రాహ్మణులు పరంపరగా జందెములు వేసికొనుచున్నారు. యాజకశబ్దము స్వతహా బ్రాహ్మణవాచకము యజ్ఞముచేయించేవారని యర్థము"– అని కలదు.

సంయుక్తప్రాంతమునందు గద్వాన్ అల్‌మూడా మొదలగు జిల్లాలయందు నాయీబ్రాహ్మణులందరు జందెములు వేసికొనుచున్నారు. మరియు ఇటోవా, ఫర్రూకాబాద్, మైనపురి. కాన్పూరు, ప్రయాగ మొదలగు జిల్లాలయందు నాయీబ్రాహ్మణులెల్లరు "నాయీ

పాండేయు" అను జీవనముగలవారు పరంపరగా జందెములు వేసికొను చున్నారు. వీరిలో పంచాంగకర్తలు, ఆ యా తావుల పెక్కురుగలరు. కాంగ్డాయను గ్రామమందు జ్వాలాదేవికి, బిలాసపూరునందు నైనా దేవికి నాయీబ్రాహ్మణులే పూజారులు. వీరెల్లరు జందెములు వేసి కొనినవారే. వారువీరననేల భారతదేశమునబుట్టి వైదికధర్మమును, పితృకర్మాదుల ఆచరించువారెల్లరు జందెములు తప్పక వేసికొన వలసినదే. మెడలో జందెము లేనిచో అట్టికర్మల కనర్హులగుదురు.

సూ॥ సర్వేషాం కర్మణా మాదౌ నవం యజ్ఞోపవీతకం ధృత్వా
కర్మాణి కుర్వీత హన్యథా దోష మాప్నుయాత్.

—గౌతమ ధర్మసూత్రము 18-అధ్యా

సూ॥ వస్త్రం యజ్ఞోవవీతార్థే ॥ త్రివృత్సూత్రంచ కర్మసు
కుశ ముంజా వాలతంతు ॥ రథవా సర్వజాతిషు.

—బోప్పనభట్టీయము 14-ఖండము. 11-సూ

సూ॥ యజ్ఞోపవీతం కురుతేసూత్రం వస్త్రంవాఽపి కుశరజ్జు మేవ.

—గోభిలగృహ్యసూత్రము-ప్రథమభాగము
ద్వితీయఖండము 2-సూ.

ఇట్లు ధర్మగృహ్య సూత్రములయందు స్పష్టీకరింపబడినది.

కర్మలు చేయునపుడు నూలుబద్దె జందెములనో, పైపంచలనో లేదా నూలుజందెములనో మెడలకు తగిలించి బియ్యము, పప్పు, ఉప్పు; చింతపండు వగైరాలు ముట్టినపిమ్మట జందెము లితరులకుండుట పాప, హేతువని నచ్చచెప్పి పురోహితుల చేతులతో తీయక ఇతర వర్ణస్థుల వారి చేతులతోనే ఊడలాగింతురు. చూచితిరా! ఈ చిత్రాతిచిత్ర మైన

మోసమును, జందెములకు మేము తగనివారమైన మాకేల ఈశ్రమమని శూద్రాదు లడుగుటలేదు. పాపపుణ్యములు మావికావు వీనివలన కలుగు సుఖదుఃఖములును మావికావని నిశ్చయించుకొన్నారేమో! మరి యెవ్వరైన ఈ పురోహితవృత్తిని అవలంబింతురని ఇది నీచాతినీచ మైన వృత్తియని - ఇది నీచమైన జన్మములకు హేతుభూతమని చెప్పుదురు. అయ్యో! అట్టి నీచవృత్తికి మీరేల పూనుకొందురని యెవరేని ప్రశ్నింప లోకశ్రేయమునకు మీ పితృపితామహుల తరింప జేయుటకని సమాధానమిత్తురు. ఆహా! వీరికి చచ్చినవారిపైగల భక్తిప్రపత్తు లపారమందుమా! లేదేని దీనికేదేని పూర్వాపూర్వకారణ సంబంధముండునందుమా! విజ్ఞులగు లోకులు నిర్ణయింపవలసియున్నది.

పూజ్యపాదులును, కాశీయందలి ఉపదేశికులునగు బ్రహ్మశ్రీ పండిత రేవతీప్రసాదశర్మగారు క్రీ॥ శ॥ 1930 సంవత్సరము ఆగష్టు 10 వ తేదిని పశ్చిమగోదావరిజిల్లా తణుకులో ఉపన్యసించుచు— "నాయీబ్రాహ్మణ కులముకుటమణియగు, ప్రతాపశాలియునగు అశోకచక్రవర్తి తమ కులగురువును, నాయీబ్రాహ్మణ వంశోద్భవుడై మహర్షి యునగు ఉపావిద్వారా బౌద్ధధర్మముల ప్రపంచమందంతట వ్యాపింప జేసెను" అని తెలిపిరి. బౌద్ధధర్మమును ఖండఖండాంతరముల నిండింప జేయు దీక్షాకంకణముల ధరించిన అశోకచక్రవర్తి వంశీయులను ఆ మతమును సర్వనాశనమొనర్ప బ్రయత్నించిన భయంకరజాతి సామాన్యజాతుల నెట్లువిడుచును?

భారతీయులెల్లరు వేదముచదువదగినవారని స్త్రీలును జందెములు వేసికొన అర్హులని ఎలుగెత్తిచాటి ఆర్యమతమును సంస్థాపించిన శ్రీమద్దయానంద సరస్వతీస్వాములవారిని పాలలో గాజుపొడి గలిపి

చంపినది మొన్న మొన్న నే పాదసేవకుడుగా మెలగి శిష్యుడుగా చేరిన ఒక మతోన్మాదియేకదా! పెద్దకులాలవారు అల్పసంఖ్యాకులైనను నోళ్ళును పెద్దవగుటచేత పరుల గోరంతదోసాలను కొండంతలుగా ప్రచారముచేయుచు తమ కొండంతదోసాలను నామరూపాలులేకుండ చేసికొనుచు ఇంతకాలము సుఖముగా జీవించుచున్నారు. ఇతిహాసములలోనేమి, పురాణములలోనేమి, చరిత్రలలోనేమి, వర్తమానకాలముననేమి సర్వమత సమ్మతమగు విధానమును బోధించువారిని సర్వవిధముల బాధించుట మనము చూచుటలేదా!

తమ మంత్రతంత్రములచే సామాన్యజాతులవారిని, చదువు సంధ్యలులేని పామరుల వేధించుకొని తినువారలు గ్రుడ్లు మిటకరించుకొని చూచుచుండ దేశము నలుమూలల కారుమబ్బులు గ్రమ్మినట్లు హిందూమత విధ్వంసమొనర్చు మహమ్మదీయుల జయింప నెత్తురు టేర్లలో ఈదులాడిన మహారాష్ట్రసింహమగు జిజియాబాయికుమారుడు శివాజీచక్రవర్తి శూద్రుడగుటచే పట్టాభిషేకమునకు అనర్హుడని ఆ నాటి అగ్రజాతి నిర్ణయించినది. తమకు గావించిన మేలును విస్మరించినది. మంత్రతంత్రములతో మహారాజుగా అభిషిక్తునిచేయ ఆంక్ష పెట్టినది. తుదకు నాలుగులక్షల రూపాయలు లంచమిచ్చి కాశీపురనివాసియగు ఖగభట్ శాస్త్రిగారిని శిష్యులతో రప్పించుకొని యెట్టకేలకు శివాజీ సింహాసనమెక్కెను.

కులాచారపద్ధతులకు దెబ్బతగిలినదని, శూద్రజాతివాడు సింహాసనమెక్కిన సర్వజాతులవారు నమస్కరింపవలనుపడదని, కులధర్మములు కూలిపోయిన హిందూమతమేలయని, ముక్కోటి దేవతలు మొగముముడుచుకొని భారతదేశము వదలిపోకుందురాయని మహా

రాష్ట్రబ్రాహ్మణులెల్లరు మూకలుమూకలై వాపోవుచు బారులుదీరి గోచీ స్వామియగు సమర్థ రామదాసునుచేరి తమగోడును విన్నవించిరి. పైకి సమతాధర్మ ప్రబోధకుడయ్యును తమజాతి గగ్గోలులో బేలుపడి యుండ కంఠదఘ్నమగు క్రోధరసావేశమును లోనడమికొని తెచ్చుకోలు ముఖవికాసముతో శిష్యుడగు శివాజి యింటిముందు నిలచి "భవతి భిక్షాందేహి" యని పలికెను. అమాయకుడగు శివాజి తనసర్వస్వము గురుసమర్పణమని చీటివ్రాసి యాతని జోలెలో పడవేసెను. శివాజీ త్యాగమును, గురుభక్తిని ప్రశంసించినట్లు నటించుచు "సింహాసనముపై తనపాదుకలుంచునట్లును పాదుకలకు ప్రతినిధిగామాత్రము రాజ్యపాలనము గావింపుమని ఆగోచిపాతస్వామి శాసించెను. అనాడు రాముపాదుకలు ఈనేడు రామదాసుపాదుకలు గద్దెనెక్కినవని తిరిగి రామరాజ్యము వచ్చినదని మూలమూలల సోమరిపోతులగు తిండిపోతు రాయళ్ళు ప్రచారము గావింపసాగిరి. తమ కుతంత్రము పారినదని లోలోన మురియసాగిరి.

సింహాసన మెక్కుటకు తగినవాడుకాదని ముప్పతిప్పలుపెట్టి మూడుచెరువుల నీరుత్రాగించిన ఆ శూద్రజాతివాడగు శివాజీని నేడు హిందూమతముసి వెట్టికేకలువెట్టు మూకలు, సంఘాలు పూజించుచున్నవి. పురవీధులలో ఆయనపేరుతో చందాలువసూలుచేసి బొమ్మలు నెలకొల్పుచున్నవి. బ్రదికినంతకాలము బాధించి, వేధించి కసిబిసి మసిచేసి అడ్డముతొలగిసదనికాబోలు నేడు హర్షించుచున్నవి. చేతులార బలినిచంపి వాని దానమహిమకు, బొటనవ్రేలు దీయించుటచే జీవచ్ఛవముగా బ్రదుకుచున్న ఏకలవ్యుని గురుభక్తికి – ఇట్టి యకృత్యముల కెన్నింటికో ఈ దేశము కర్పూరహారతు లెత్తుచున్నది. చంపి

సమాధిచేసి పెద్దఎత్తుగా దేవుళ్ళని ప్రచారముగావించి ఆ సమాధులపై గుడిగోపురాలుకట్టుట భారతీయులకు సులభతరమైనపని.

నాయిూబ్రాహ్మణ కులశిరోరత్నమగు అశోకచక్రవర్తి వంశమును, వారనుసరించిన ధర్మమునుగురించి కొంతకుగొంత విచారించుకొని చారిత్రక సత్యముల గుర్తించి శాస్త్రములపేర జరుగు మహాపచారముల మనము మననముచేసికొనుట అప్రస్తుతము కాదనుకొందము. మహాపద్మనందుని యనంతరము చంద్రగుప్తుడు మౌర్యవంశమునకు నాయకుడై గ్రీకుల జయించి క్రీ॥ శ॥ పూర్వము 322 సం॥ నుండి 297 వరకు పరిపాలించెను. అపిమ్మట వానికుమారుడు బిందుసారుడు 297 నుండి 272 వరకు న్యాయపరిపాలనము సాగించెను. ఇతనికాలము లోనే జైన బౌద్ధమతములు అందలి ధర్మప్రచారములు నలుమూలలు ప్రాకెను. ఈ బిందుసారునిభార్య కోసలాదేవి. ఈమెకు బ్రాహ్మణ మతమంధభిలాష మిక్కుటము.

ఈ కోసలాదేవి గర్భముధరించి ఒక మగశిశువును గనెను. తన విశ్వాసానుసారము శుభాశుభములు తెలిసికొనుటకై తనపురోహితులను పిలువనంపి యడిగెను. వారును ఈ వంశపు కుదురూడబెరుకుటకు ఇదేసమయమని కుట్రపన్ని ఆమెవలన జీవించుచుంటిమను కృతజ్ఞత లేకయే ఈ పిల్లవాని జననము పాపగ్రహములతో కూడికొనినది - తలిదండ్రులకు గండమని తమ పంచాంగములుచూచి మీనమేషములు లెక్కించి చెప్పిరి. ఆ అమాయకురాలు ఆ వంచకులమాటలను నమ్మి ఆనెత్తురుకందును అశోకవనములో భటులతో పారవేయించెను. చూచితిరా! ఇట్టి బూటకములుచెప్పి ఎంతమందిని నిట్టనిలువునకూల్చుచున్నారోకదా! ఇప్పటికీ పాపగ్రహ శాంతికై ఈపాపులు శాంతి

హోమములు చేయించుట మనము చూచుచున్నాము. ఈగ్రహచారము మానవులకేకాక దేవతలకుసైతము కలుగుచున్నది. ఈమధ్య దేవతాశాంతులు పెచ్చుపెరిగిపోవుచున్నవి.

ఈ శిశుమారణ దారుణకృత్యమును బిందుసారుడువిని మహావ్యథపడి గ్రుడ్డినమ్మకము లెన్నికుటుంబముల గూల్చుచున్నవోయని యనుకొని భటులచే ఆ శిశువును దెప్పించి అబిడ్డ సుఖముగానుండుట కనులారగాంచి ఆనందించి అశోకవర్ధనుడని పేరుపెట్టెను. ఇతడే అశోకభూపతియై భరతఖండమునంతను తనయేలుబడిలోనికి దెచ్చుకొని చక్రవర్తియాయెను. ఇతడు క్రీ॥ శ॥ పూర్వము 272 నుండి 231 వరకు నలువదియొక్క సంవత్సరములు అఖండముగా ఈభూమండలమునేలెను. తనపుట్టువున జరిగిన కుత్రులనెల్ల ఆలించి హృదయము కంపించి ఈ మోసమునుతుదముట్టింప అహరహము మహాప్రయత్నము గావించెను. ఆర్యకుతంత్రముల రూపుమాప కంకణమునుగట్టెను. భౌద్ధధర్మమును దిగ్విదిక్కుల ప్రచారముగావింప సమధికోత్సాహముతో ధర్మదీక్ష వహించెను. భావములలో, భాషలలో విప్లవమును రేపెను. ప్రతి గ్రామమున గ్రామీణుల కెల్లరకు అర్థమగునట్లు ధర్మశాసనముల వ్రాయించెను. జాతి మతభేదముల మొదలంట నశింపజేసెను.

ఇతడు లలితకళలపోషించెను. విశేషించి సంగీతమును, సాహిత్యమును, శిల్పమును సర్వతోముఖముగ అభివృద్ధిగావించెను. బౌద్ధులు పలుకష్టములకోర్చి కనిపెట్టిన చరకము శస్త్రచికిత్సతో నిండియుండ దానిని తగ్గించి యౌషధసేవవలననే సమస్తవ్యాధులు, రణములు పోవునట్లు మహావైద్యశిఖామణులచే పరిశ్రమముచేయించి శుశ్రుతమును కనిపెట్టునట్లొనర్చెను. తన నాయీబ్రాహ్మణ వంశమువారెల్లరు సర్వులకు

ఉచితవైద్యముగానింప కట్టడిచేసెను. అందువలన నేటికిని సంగీతము, సాహిత్యము, వైద్యము నాయీబ్రాహ్మణుల వంశవృత్తులై యున్నవి. ప్రత్యేక మొకజాతికి గౌరవముగాని నైచ్యముగాని లేదని ఋజువు పరిచెను. "గుణాఃపూజాస్థానం గుణిషు నచలింగం నచవయః" అను సత్యసూక్తిని తన యేలుబడిలో అక్షరాల పాటింప సర్వజనుల సన్మార్గమున నుంచెను. అంతటితో ఆ వంశమంతరించి శుంగవంశము తలయెత్తినది.

ఇట్టి మహోన్నతదశనంది.శస్త్రవైద్యము, ఆయుర్వేదము, లలిత కళలు, సమతాధర్మము, అహింస మొదలగు సద్గుణముల కాలవాలమగు నాయీబ్రాహ్మణవంశము సంపూర్ణ బౌద్ధమతమునకు పునాది యగుటచేతను, సనాతన దురాచారముల ఎదిరించి దుష్కర్ముల నెల్ల శస్త్రచికిత్సచేయుటచేతను కసిపట్టి నాటికినేటికి కొందరు వేధించుచునే యున్నారు. అతివికృతములగు కథలనెన్నిటినో వీరి కంటగట్టి నీడవలె వెంటాడుచున్నారు. సర్వదా-సర్వథా అధోగతిపాలొనర్ప చూచుచున్నారు; కాని పరాన్నభుక్కులు కాకపోవుటచేతను, చేతివృత్తుల వారగుటచేతను, పరుల మోచేతినీరు త్రావు సోమరు లీజాతిలో ఇంత వరకు పుట్టకపోవుటచేతను, స్వతంత్రజీవనము చేయువారగుటచేతను మానవతకోలోప్పక ఈ వంశమువారు గౌరవముగా నిలిచియున్నారు.

ఇక ఈ నాయీబ్రాహ్మణులగూర్చి తుదిసారిగా వేద, సంహిత, శ్రుతి, స్మృతుల అవలోకింపవలసియున్నది. సామవేదమును వెలయించిన సవితామహర్షి పవిత్రమగు క్షురకర్మ కధిపతి. వానివంశమే ఈ నాయీబ్రాహ్మణవంశమగుట కుదాహరణములుగా తార్కాణముల చూడుడు—

మం॥ ఓమ్ యేనా వపత్సవితా క్షురేణ॥సోమస్యరాజ్ఞోవరుణస్య
విద్వాన్ తేన బ్రహ్మణో వపతే దమస్య ॥ గోమానశ్వవా
నయమస్తు ప్రజావాన్ ।

—అధర్వణవేదము. 6-కాం. 68-సూ.

మం॥ యత్ క్షురేణ మర్చయితా సుతేజసా
వప్తా వపసి కేశశ్మశ్రు శుభంముఖం
మా న ఆయుః ప్రమోషీః

—అధర్వణవేదము. 8-కాం. 2-సూ.

దీనికి సాయణాచార్యులవారి భాష్యమును దిలకింపుడు—

"హే దేవ! సవితః సంస్కారకపురుష వా త్వం వప్తా కేశానాం ఛేత్తానాపితః సన్ మర్చయితా సుతేజసా వ్యాపారయితా శోభన తేజో యుక్తేన క్షురేణ కేశ, శ్మశ్రు, శిరోరోమాణి ముఖరోమాణిచ వపసి ॥ యద్యపి వపతి ధాతుర్బీజ సంతానార్థ స్తథాపి కేశసమభివ్యాహారాత్ ఛేదనే వర్తతే తదావపనం కుర్వన్ ముఖం గోదాన చౌలోపనయనైః సంస్క్రియమాణస్య బాలస్య ముఖం శుభందీప్తం తేజస్వికురు వపనేసతి ముఖవికాసభావా దేవం ప్రార్థ్యతే న అస్మాకం పుత్రస్య ఆయు ర్మా ప్రమోషీః".

భా॥ ఓదేవసవితా! సంస్కారకపురుషుడు (ఋత్విజుడు) లేదా నీవు కేశములను ముండనముచేయు నాపితుడవై తేజయుక్తమైన ఉత్తమ మగు కత్తితో తలయొక్కయు, గడ్డముయొక్కయు వెంట్రుకలను మీసములను గొరుగుచున్నావు.

మం॥ ఓమ్ అయమగన్త్సవితా ॥ క్షురేణోష్ణేవాయ ఉదకేనేహి

—అధర్వ

భా॥ ఓ వాయూ ! సవితవచ్చెను తాము కత్తిని వేడినీళ్ళను తీసి కొనిరండు.

ఈమంత్రమున వర్ణింపబడి కత్తిని, వేడినీళ్ళను దెచ్చిన వాయు ఋషియే యజుర్వేదప్రకాశకుడు. ఇతడే యజుర్వేదమున కర్మకాండను ప్రవేశపరిచెను. ఇది నేటికి నాయీబ్రాహ్మణ సంఘమందే కనుపట్టు చున్నది. సవితాఋషి సామవేద ప్రకాశకుడై యున్నాడు. ఈ సవితా ఋషియే అధర్వణవేదములో ఆరవకాండలో 68 సూత్రమందలి 3-వ మంత్రానుసారము ప్రప్రథమమున కత్తినిబట్టి సోమరాజావరుణునకు క్షౌరముచేసి అనంతరము బ్రాహ్మణులకు నేర్పెను. ఆ నేర్చుకొన్న వారే వైదికులలో ఉత్తములగు నాయీబ్రాహ్మణులు.

ఈ సవితామహర్షికి సావిత్రియను కుమార్తెగలదు. ఈమెకే గాయత్రియను రెండవపేరుకలదు. గాయత్రినే కోరికోరి బ్రహ్మ పెండ్లి యాడెను. ఈనాడు పూర్వాచారములు పాటించు పెద్దకులమువారు ముప్పూటు గాయత్రీజపము గావించుచు ముక్తి నందుచున్నారు. నాయీవంశకర్తయై, వృత్తివిద్యాగురువైన సవితామహర్షి కుమార్తె నారాధించుచు ఆమెతమ్ములైనవారి నిట్టిబాధలకు గురిచేయుటధర్మమా! ధర్మద్రోహులై, కృతఘ్నులై, పరాన్నభుక్కులై మెలగువారికి సత్య ధర్మము లెక్కడివి ? విష్ణుపాదోద్భవయగు గంగ నారాధించుచు ముక్తు లగుచు తత్సోదరులగు శూద్రుల అవమానముచేయు కృతమెరుగని వారల కిది యొకలెక్కా !

మం॥ ఓమ్ యేనపూషా బృహస్పతే
ర్వాయో రింద్ర స్వచాపవత్

తేన తే వపామి బ్రాహ్మణా జీవాతవే
జీవనాయ దీర్ఘాయుష్యాయ

—సామవేదము. 6-ఖండము 7-వ మంత్రము.

భా॥ ఏ కత్తిచే మంగలి బృహస్పతికి, వాయువునకు, ఇంద్రునకు క్షౌరముచేసెనో ఆ బ్రహ్మరూపమగు కత్తిచే జీవించుటకు మఱియు జీవనముయొక్క దీర్ఘాయువుకొరకు క్షౌరము చేయుచున్నావు — ఈ రీతిగా వేదము కత్తిని బ్రహ్మతో ఉపమానము చేయుచున్నది. దేవతాధిపతుల కాయుష్యమునిచ్చి పోషించువాడు నాయీ బ్రాహ్మణుడు అనుచున్నది.

సూ॥ జపత్యాయ మగాత్ సవితా క్షు రేణేతి సవితారం మనసా
ధ్యాయన్ నాపితం ప్రేక్షమాణః

గోభిలగృహ్యసూత్రము. 1-6-10 మరియు

వా॥ లౌహక్షురపాణించ నాపితం స్థాపయేత్ తతః పితాఉత్థాయ ప్రాఙ్ముఖః కుమారస్యమాతుః పశ్చా దవస్థితః క్షురపాణిం నాపితం పశ్యన్ తమేవ సవితృరూపం ధ్యాయన్ జపతి। తతోఽగ్నే రుత్తర దేశం నీత్వా పుష్పాద్యలంకృతో నాపితః కుమారం ముండయతి-

—శబ్దకల్పద్రుమకర్తయగు భవదేవకృత
"దశకర్మపద్ధతి" అను గ్రంథము.

ఇట్లు వేదములలో గృహ్యసూత్రములలో కర్మకాండలలో ఎన్నేని ప్రమాణములు చూపవచ్చును; కాని గ్రంథము విస్తరమగునని మానితిమి. ఇంకొక్క స్మృతిప్రమాణముంజూపి ఈ విషయము నిక విడుతుము.

శ్లో॥ ఆచార్యస్తు పితాప్రోక్తః ! సావిత్రీ జననీ తథా
బ్రాహ్మణక్షత్రియవిశాం ! మౌంజీబంధన జన్మని
వృత్యా శూద్రసమ స్తావత్ విజ్ఞేయా స్తే విచక్షణైః
యావద్వేదేన జాయంతే । ద్విజా జ్ఞేయా తతః పరం॥

—శంఖలిఖితస్మృతి --అధ్యా 7-8-శ్లోకాలు.

భా॥ బ్రహ్మచారి కట్టుకొనెడి ముంజదర్భమొలత్రాడు ధరించు సమయమున బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు గురుడే తండ్రి, సావిత్రియే తల్లి. (ఇంతకుముందు కనిన తలిదండ్రులు శూద్రజన్మమును ప్రసాదించిరి. ఈ తలిదండ్రులు కర్మపూతునిచేసి ద్విజన్ముని గావింతురు) మునుముందు వృత్తిచే నెల్లరు శూద్రులు. వైదికకర్మకలాపములతో ద్విజన్ములగుదురు.

ఈ ధర్మశాసనముచే నుపనయనముగానివాడు బ్రహ్మక్షత్రియ వైశ్యజాతులలో చేరనేరడు. ఉపనయనమున ప్రధానమైన కర్మ క్షురకర్మ - ముమ్మొదట ఎల్లవారు శూద్రులై సంస్కారముచే ద్విజన్ములగుచున్నారు. శూద్రులైనవారిని ఆ యా యున్నతకులములలో జేర్చుచున్న బజంత్రీలను శూద్రులలో లెక్కించుట ధర్మముకాదు. ఆజన్మ శూద్రత్వము పోగొట్టి బ్రాహ్మణత్వమిచ్చువానికి శూద్రత్వ మంటగట్ట ఎవడు శక్తిమంతుడో పెద్దలాలోచింపవలసి యున్నది.

తులసీదాసు రామాయణమందు బాలకాండలో రామలక్ష్మణ భరత శత్రుఘ్నులకు నలువురకు ఇక్ష్వాకువంశ గురువగు వసిష్ఠులవారు స్వయముగా ఆయుష్కర్మము గావించిరనియున్నది. ఇంకను సుప్రసిద్ధమగు చరకసంహితలో—

శ్లో॥ పౌష్టికం వృష్య మాయుష్యం ॥ శుచిరూపం విరాజినం
కేశశ్మశ్రునఖాదీనాం ॥ కర్తనం సంప్రసాధనం.

భా॥ తల, గడ్డము, మీసముల వెంట్రుకలు దీయుటవలన, గోళ్లు దీయుటవలన శౌచము, అలంకారము, సమస్తారోగ్యములు సంప్రాప్తించును. దీనివలన జనులనెల్లర ఆరోగ్యవంతులునుగా జేయునట్టి వృత్తిని విడువక చేయునట్టివారిని తగినరీతిగా గౌరవించి పూజింపదగును గాని యంటరానివారని తుంటరిమూకలట్లు దూషింప తగదు. అట్లు దూషించువారున్న వారికిసరియగు గుణపాఠము చెప్పవలసి యున్నది. ఐహికాముష్మికఫలముల రెంటిని ప్రసాదించునది కల్యాణభక్తులేకదా !

శ్రీ మి. డబ్ల్యూక్రుక్ బి. ఏ., గారు "ట్రైబ్సు అండ్ కాస్టు" అనుగ్రంథమున — "నాయీబ్రాహ్మణుడైన సేనభక్తుడు పరమవైష్ణవుడు వీని వంశజులు కొంతకాలము బాంధవగఢరాజులకు కులగురువులుగా నున్నారు" అని కలదు. ఈ సేనభక్తుడు భీష్మాచార్యుని అవతారమని అగస్త్యసుతీక్ష్ణా సంవాదమను గ్రంథమున రామానందావతారమున 132 వ అధ్యాయమున గలదు. ఋచ్చునకై —

శ్లో॥ భీష్మ స్సేనాభిదోనామ ॥ తులాయాం రవివాసరే
ద్వాదశ్యాం మాధవే కృష్ణే ॥ పూర్వాభాద్రాపదేచతమ్.

ఇట్టి మహాపురుషు లవతరించుటకు యోగ్యమైన కులమును నీచకులమని యనుట సమంజసమేమో సభ్యలోకమే నిర్ణయింపవలసి యున్నది. స్త్రీలలోసైతము నారాయణి, పన్నా మొదలగు భక్తశిరోమణు లెందరో ఈ నాయీబ్రాహ్మణవంశమునందు జన్మించిరని మీరందరెరిగిన సంగతియే.

ఒకజాతిచరిత్ర ఆ జాతిచేయు పనిపై ఆధారపడి యుండును. ఆ పని యెంత పూర్వకాలమునుండి యున్నదో అది యెంతటి పవిత్రత చేకూర్చునో యనికూడ చూడవలసియున్నది. ఒక్క హిందూమతము నందేకాక బౌద్ధ, జైన, క్రైస్తవ, మహమ్మదీయాది మతములందును వీనియందలి అవాంతరశాఖలలోను ఈ క్షురకర్మ ఎట్టి పవిత్రతను గాంచెనో విచారింపుడు. మానవుడై పుట్టినదిమొదలు చచ్చువరకును చచ్చినవాని చుట్టాలు ఆ మృతాశౌచమును తొలగించుకొనువరకును ఈ జాతి భూమిపై నిలువవలయునేకదా! మాయీ తెలివిడిని విషమ బుద్ధులై, కృతఘ్నులై, దుర్విమర్శనములకు దింపవలదని హెచ్చరించు చున్నారము. సమబుద్ధితో విచారించి ఆ యా వృత్తులవారి నెల్లర ఆదరించి అభిమానించుట అభ్యాసము గావించుకొని మానవులై మాన వతను నిల్పుకొన కాంక్షించుచున్నాము.

## విశేషములు:

సూతసంహితలో ఈ బజంత్రీలు రెండువిధములుగా చెప్ప బడిరి. 1. మూర్ధనాపితుడు, 2. అధోనాపితుడు, అందు —

శ్లో॥ శ్మశ్రుకర్తన కృచ్చైవ । నఖకర్తనకోవిదః
వృత్త్యానయాగ్రామమధ్యే । తిష్ఠేద్వర్ణేషు సేవకః
నరాణాంనాపితోధూర్తః । శూద్రేభ్యోప్యధికస్మృతః ॥

భా॥ క్షౌరముచేయుటకును, గోళ్ళుదీయుటకును నేర్పుగలిగి అదియే వృత్తిగా వర్ణములకు సేవకుడై గ్రామమధ్యమం దుండవలెను. నరులలో నాపితుడు ధూర్తుడు. శూద్రులలో ఇత డధికుడు.

ఇక రెండవవాడగు సాఖిల్యుడనబడు అధోనాపితునివృత్తాంతము.

శ్లో॥ మార్గ నాపితయో ర్జాతో ॥ యోసౌ సాఖిల్య సంజ్ఞికః
హీన స్సగుహ్య కేశానాం ॥ కుర్యా ద్వపన మంజసా.

భా॥ మార్గస్త్రీయందు నాపితునకు పుట్టినవాడు సాఖిల్యు డనబడును. ఇతడు హీనుడు. అధోరోమముల క్షౌరముచేయును. నాభినుండి పై భాగము శ్రేష్ఠమని అటనుండి దిగువభాగము నీచమని ఈ రచయితల యభిప్రాయము. కనుక పైభాగముచేయువారు మేలిమంగళ్ళు. దిగువ భాగము చేయువారు హీనపుమంగళ్లు అని యనిరి. అట్లే నాభినుండి పైభాగముల పుట్టినవారు త్తములని నాభినుండి దిగువభాగమున పుట్టిన వారు అను త్తములని నిర్ణయించిరి.

ఈ మంగళులలో ఈ రెండుతెగలేకాక మూడవతెగ మఱియొక టున్నట్లు శూద్రకమలాకరమున కమలాకరభట్టు తెలిపెను.

శ్లో॥ మాలాకారాత్ క్షత్రియాయాం ॥ శిలీంధ్రో మర్దనక్రియః
హీన స్సశూద్రధర్మేభ్యో ॥ జీవికాస్యాంగమర్దనం.

భా॥ మాలాకారునికి క్షత్రియస్త్రీయందు శిలీంధ్రుడనువాడుపుట్టును. ఇతడు శూద్రధర్మములతో హీనుడై దేహముపట్టి సుఖపెట్టుటచే ధన మార్జించి జీవించును. ఇదే "దిడ్డిమంగలిజాతి" ఇట్లు ఇంకెన్ని భేదములుగలవో చూడవలసియున్నది.

## ప్రకీర్ణములు:

పూర్వకాలమున రాజవంశీయులగు విశ్వామిత్రాదుల జోలికి పోయిన కులోన్మాదులు శృంగభంగమునంది మతిగలిగి సంచరించిరి.

ఇటీవల నియోగుల జోలికిపోవ మాన్యశ్రీ నందిరాజు లక్ష్మీనారాయణ దీక్షితులు మొదలగు పెద్దలు గుణపాఠమునేర్పి స్వసంఘ పౌరోహిత్యమును నెలకొల్పుకొనిరి. ఔద్ధత్యము నణచిరి. అంతటితో ఆగక వైఖానసులజోలికిపోవ శ్రీమాన్ వేదాంతం శ్రీనివాసాచార్యులువారు విజృంభించి తమవలె పూర్వపూర్వ జాతులన్నియు సంకరజాతులే యనియు, వ్రాత్యులనియు, పతితులనియు సావధానముగా సహేతుకముగా చర్చించి విడిచిరి. ఇప్పటికి ముడుచుకొని యుండలేక శైవ బ్రాహ్మణుల జోలికిబోవ శ్రీమద్బోధానంద యతీంద్రులవారు ఈ దుర్వాదముల తునాతునకలుచేసి బ్రాహ్మణ స్వరూపకథనమను రెండు గ్రంథముల వెలయించి బ్రదుకుబండాలమును వెల్లడిగావించిరి.

ఇటీవల వైశ్యులజోలికిపోయిన పూజ్యశ్రీ ఆత్మూరి లక్ష్మీ నృసింహ సోమయాజులు, మామిడిపూడి వేంకటార్యులు మొదలగు ఉద్దండపండితులు, దైవజ్ఞులగు దాచేపల్లి రామబ్రహ్మసిద్ధాంతిగారు మొదలగువారు పైవారి కుతంత్రముల చీల్చి చెండాడి స్వసంఘ పౌరోహిత్యమును నెలకొల్పుకొని తమంతతాము గౌరవముగా నుండిరి. ఆపై విశ్వబ్రాహ్మణులజోలికిపోవ పూజ్యశ్రీ వడ్డెపాటి నిరంజనశాస్త్రి గారు మొదలగు మహామహులెందరో కాసెగట్టి రంగమున దుమికిరి. కోర్టులలో వ్యాజ్యెములుదెచ్చి జయమందిరి. ఈ తరుణముననే ఉత్తర దేశమున నాయీబ్రాహ్మణులపై దండెత్తగా బ్రహ్మశ్రీ పండిత రేవతీ ప్రసాదశర్మగారు మొదలగు విద్వచ్ఛేఖరులు పైవారి బ్రదుకులు తూర్పారబట్టిరి. ప్రతిపక్షుల కోర్టుల కెక్కించి జయమందిరి.

మనబ్రదుకు లిట్లుండ మనకేల యితరులజోలియని యనుకొనక శూద్రజాతిపై ధ్వజమెత్తి పుష్పగిరి పీఠాధిపతుల యాజమాన్యమున

ఆంధ్రదేశములో మహావిప్లవము రేపిరి. దీనిని మాన్యశ్రీ సూర్యదేవర రాఘవయ్యచౌదరిగారు మొదలగు పెద్దలెందరో ఎదురొడ్డి నిలిచి ప్రతిపక్షులను శంకరమాన్యములు పట్టించిరి. ఈ రణరంగమున పూజ్యపాదులగు జి. యస్. బి. సరస్వతిస్వాములవారు బాసటయై నిలచి పూర్వవాఙ్మయమును మథించి శత్రువర్గీయులు నోరుమెదపరానిరీతి ప్రమాణముల చూపిరి. ఇట్లు మన గతచరిత్ర దుర్భరముగా నున్నది. మే మీప్రకరణమున ఆంధ్రదేశములో ప్రసిద్ధములగు కులముల కొన్నిటిని మాత్రము పేర్కొని వారికంటుగట్టిన మాలిన్యమెట్టిదో చూపదలచితిమి.

సర్వమానవులకు మానమును - అభిమానమును నిలుపు చేనేతవారినిగూర్చి—

శ్లో॥ నృపాయాం వైశ్యసంసర్గాత్ ॥ ఆయోగవ ఇతి స్మృతః
తంతువాయా భవంత్యేతే ॥ వస్త్ర కాంస్యోపజీవినః
శాలికాః కేచి దత్రైవ ॥ జీవనం వస్త్రనిర్మితం.

—ఔశనస్మృతి

భా॥ క్షత్రియస్త్రీయందు వైశ్యునిపొందువలన పుట్టినవాడు, ఆయోగవుడనబడును. వారే తంతువాయులనగ దేవరులు. బట్టలునేయుట వీరి వృత్తి. ఇందే శాలికులనగా సాలెవాండ్రును గలరు. వారికిదియే వృత్తి. మరియు—

శ్లో॥ కుక్కుటస్యేహ భవతి ॥ కుంభకారేణ సంగతా
తస్యా స్సూనుస్తు విఖ్యాతః ॥ కువిందక ఇతిస్ఫుటం.

—శూద్రకమలాకరము.

భా॥ కుక్కుటజాతిస్త్రీయందు కుమ్మరవానికిపుట్టినవాడు కువిందకుడు.

శ్లో॥ కౌశేయాని సవస్త్రాణి ॥ రచయే దాత్మ వృత్తయే
తుల్యోసావంత్యజాతీనాం ॥ స్వధర్మం సతుపాలయేత్
—శూ॥ క॥

భా॥ కువిందుడు పట్టుబట్టలు, పొత్తిపంచలు నేయును. ఇతడు అంత్యజాతులకు సమానధర్మముగలవాడు. స్వధర్మమున నడుచును. ఇతడె పట్టుసాలి.

శ్లో॥ సంగతా వేనవనితా ॥ వర్తకేన యదా రహః
తస్యా శ్శాబరికాభిఖ్యః ॥ పుత్రోసౌ లోకసంమతః
సహీన స్తంత్యజాతిభ్యః ॥ శుచివాసో విధాయకః.
—శూ॥ క॥

భా॥ వేనస్త్రీయందు వర్తకునకు రహస్యముగా బుట్టినవాడు - శాబరికుడనబడును. అంత్యజాతికంటె హీనుడు. శుద్ధవస్త్రములనేసి జీవించును.

శ్లో॥ అభీరీ కుక్కుటాభ్యాం యో ॥ జాత స్సోభిర సంజ్ఞకః
సకుర్యాత్తు సవీణాంహి ॥ వాసాంసి స్వాత్మవృత్తయే.
—శూ॥ క॥

భా॥ ఆభీరస్త్రీయందు కుక్కుటునికి పుట్టినవాడు అభిరుడనబడును. ఇతడు తొగరుపట్టునార మొదలగువానిచే బట్టలునేయును. ఇట్లు పెక్కుతెగలీ చేనేతవారిలో గలవని శూద్రమలాకరమున గలదు.

మహేంద్రవంశమని పిలువబడు మేదరజాతివారినిగూర్చి—

శ్లో॥ కర్మచండాలకా త్పుత్రం ॥ వైదేహీ పాండుశోపకం
లేభే బురుడజాతిత్వం ॥ సదా వంశవిదారణం —శూ॥ క॥

భా॥ భ్రష్టసన్యాసికి వైదేహస్త్రీయందు పాండుశోపకుడని పుట్టును. వీడే బురుడజాతియనగ మేదరివాడు, ఇతనికి వెదురుబద్దలచే పని చేయుట వృత్తి.

శ్లో॥ చండాలాత్ పాండుశోపాక ॥ స్త్వక్సార వ్యవహారవాన్
ఆహిండకో నిషాదేన ॥ వైదేహ్యామేవ జాయతే ॥—శూ॥క॥

భా॥ చండాలునికి వైదేహియందు పాండుశోపకుడుపుట్టి వెదురు బద్దలచే జీవించును. మరియు దానియందే నిషాదుని కాహిండకుడను వాడు పుట్టును. వెదురుపేళ్ళచే పనిచేయుటయే వృత్తి. ఇదె మేదర జాతి. ఇట్లు వీరిని అంటరానివారుగా పరిగణించిరి.

ఇక రజకులగూర్చి విచారింతము—

శ్లో॥ ఉగ్రా త్పారసవీపుత్రో ॥ మౌకళి స్తైలికో భువి
రజకో వర్ణతోహీనః ॥ ప్రథమ శ్చాంత్యజేషు సః
వస్త్ర నిర్ణేజనం కుర్యా ॥ దాత్మ వృత్త్యర్థ మేవచ.

భా॥ ఉగ్రునికి పారసవస్త్రీయందు బుట్టినవాడు మౌకళి – అనగా తిలఘాతకుడు. రజకుడు అనగా చాకలియు – వర్ణములకు హీనుడు. అంత్యజులకు ప్రథముడునగును. బట్టలుదుకుటయే వీనికివృత్తి.

శ్లో॥ ఉగ్రజాతంతు వైదేహ్యాం । మంజూషంరజకం విదుః
వహేదసౌ తైలయంత్రం । ఉత్తమ శ్చాంత్య జాతితః॥

తైలహింసా యంత్రరవా ॥ కర్షణా త్పాపసంభవః
అతో మౌకళికో నిత్యం ॥ నిర్వాస్యో నగరా ద్బహిః.

భా॥ విప్రస్త్రీయందు వైశ్యునకు బుట్టినస్త్రీ వైదేహి యనబడును. ఇట్టి వైదేహికి ఉగ్రునకుగలిగిన పుత్రుడు మంజూషరజకుడు. అంత్యజాతికంటె నుత్తముడు. తైలయంత్రముచే పనిచేయును. తిలలు గానుగలో నాడించుటచే పాపియగును. కనుక పట్టణమునకు వెలిగా వీనిని కాపురముంచవలెను. ఇట్లు తెలికలవారును, రజకులును సోదరులయ్యు భిన్నవృత్తులాచరించిరట. ఈ యిరువురు అంటరానివారే.

ఇక యదువంశోద్భవులగు యాదవులగూర్చి వ్రాసిన వ్రాతలు పరికింపుడు—

శ్లో॥ అభీరోంబష్ఠకన్యాయాం ॥ అయోగవ్యాంతు ధిగ్వణః
భా॥ అంబష్ఠిదానియందువిప్రునకుబుట్టినవాడు ఆభీరుడు-ఇతడుగొల్ల.
శో॥ మహిష్యాయాం ద్విజాజ్జాత ॥ ఆభీరః క్షీరవిక్రయీ.
—విశ్వంభరశాస్త్రం.

భా॥ మహిష్యయందు బ్రాహ్మణునివలన పుట్టినవాడు గొల్ల. ఇట్టి దుష్టమగు వ్రాతలనెల్ల ఖండించి పూజ్యశ్రీ బత్తుల లక్ష్మయ్యగారు "యాదవరాజకులప్రదీపక" యను గ్రంథమును రచించిరి. ఇది చూడదగినది. ఇందు విశేషములు పెక్కులుగలవు.

ఇట్లు శూద్రజాతిలోనివారినెల్ల సంకరులుగా శ్రుతిస్మృతులు చెప్పెను. వీనినెల్ల ఒక్కచోట ఏర్చికూర్చి కమలాకరభట్టు అనువాడు శూద్రకమలాకరమను గ్రంథమును వ్రాసెను. ఇట్టి గ్రంథములు జాతుల కవమాన మొనగూర్చునవి యగుటచే ప్రభుత్వమువారు వానిని కాల్చివేయవలెను. ఆ పని జరుగునంతవరకు ఇట్టివానికి ప్రతిద్వందిగా

ఇట్టి గ్రంథములు అవసరములని మా నిర్ణయము. లేదా ఇట్టిమతము మాకు సంబంధములేదనియైన శూద్రులెల్ల ఏకకంఠముతో చెప్పి పై కులాలపొత్తును పూర్తిగా విడనాడవలెను. అందుకే ఈ మేలుకొలుపు- లేదా – ఈ మేలికొలుపు.

## తుది పలుకు

మే మింతవరకు చూపించిన సిగ్గుచేటగు విషయములెల్ల కులము లంగీకరించిన సంప్రాప్తమగును; కనుక కులములు పోవలెనన్న మతము పోవలెను. మతముపోవలెనన్న దేవుడుపోవలెను. దేవుడెంతకాలము బ్రదికియుండునో అతని ప్రతినిధియు అంతకాలము బ్రదికి ఈ నీచ ధర్మములనే చెప్పసాగును. కనుక మొదటిదుంప దేవుడు. ఈ దుంప కానుపానులు గుర్తించి మొదలంటు కుళ్ళగించిననేకాని మతముపోదు. మతముపోయిననేకాని కులములుపోవు. కులములు పోయిననేకాని మానవుడు మానవుడుగా మనజాలడు. ఈ విషయమంతయు మేలు కొలుపుల మలిభాగములో వివరించి ప్రకటింతుము. దీని వెనువెంట అదిరాగలదు.

ఈ విషయాన్ని మన ఆంధ్రరాష్ట్ర రాజ్యపాలకుడు (గవర్నరు) శ్రీ ఖండూభాయ్‌దేశాయ్‌గారు 25–9–72 సోమవారమునాడు ఆంధ్ర పత్రిక దినపత్రికలో చేసిన విజ్ఞప్తిని విజ్ఞలోకము పరికింపగోరు చున్నాము—

"అస్పృశ్యత - కులతత్వం మానవులు ఏర్పరుచుకున్నచట్టాలు. వీటిని ఎంతత్వరగా రూపుమాపితే భారత సమాజానికి అంతమంచిది. ఈ రెండింటివలన సమాజం ప్రస్తుతం అపసవ్యంగా తయారైంది. అని శ్రీ దేశాయ్ అన్నారు. సమాజంలో కులతత్వం, అస్పృశ్యతను రూపు

మాపడానికి కులాంతర వివాహాలు, మతాంతర వివాహాలు విరివిగా జరగాలనిగూడా ఆయన పేర్కొన్నారు.

వేదాలు, బౌద్ధమతం, క్రైస్తవమతం, ఇస్లాంమతం ఏదికూడా కులవ్యవస్థను ప్రవచింపలేదని రాష్ట్రగవర్నరు శ్రీ ఖండూభాయ్‌దేశాయ్ పేర్కొన్నారు. అభివృద్ధిచెందుతున్నవారుగా పేర్కొనబడేవారు తాము అగ్రవర్గాలవారమని చెప్పుకునేవారు కృతకంగా తయారుచేసినదీ కుల వ్యవస్థ అని శ్రీ ఖండూభాయ్‌దేశాయ్ అన్నారు.

## బలహీనవర్గాలపై పెత్తనం

సమాజంలో అణగారియున్న దిగువవర్గాలపై తమ పెత్తనం సాగించుకోవడానికి అగ్రకులాలని చెప్పుకునేవారు ఈ కులవ్యవస్థను ప్రబోధిస్తున్నారు. చైతన్యవంతమైన సాంఘికసంస్కరణలు రానిదే ప్రజాస్వామ్యం, సోషలిజం, మతాతీతవిధానాలు కేవలం నినాదాలుగా ఉంటాయన్నారు. ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమానత్వంగల రాజ్యాంగం మనకు కలదన్నారు. ఇంకా అస్పృశ్యత అలాగే ఉన్న దన్నారు. సాంఘికసంస్కరణలలో పట్టణఆస్తుల, కమతాల పరిమితులు జరూరుగా అమలు జరుపకపోతే ప్రయోజనం లేదని అన్నారు - ఇంత వరకు ఇతరుల స్వార్థానికి గురియయిన 95 శాతం ప్రజానీకానికి తోడ్పడడానికి విజ్ఞానవంతులయిన ప్రజలు ముందుకు రావాలని గవర్నరు కోరారు.""

మాన్యమహోదయులగు గవర్నరుగారి ఈ ప్రసంగమును; విజ్ఞప్తిని విజ్ఞానవంతులయిన ప్రజలనుసరింప మేమునుకోరుచున్నాము.

—)*(—

LIBRARY

68

# ముద్రణ ప్రదాతలు

—♦—

1. శ్రీమతి పాములపాటి చంద్రమతీదేవిగారు 100—00
భర్త: కర్నల్ శ్రీలలితేంద్రనాథ్ చౌదరి

2. శ్రీ గూడపాటి సాంబశివరావుగారు 100—00
మహారాజ గవర్నమెంటు సంస్కృత కళాశాల
ఆంధ్రోపన్యాసకులు, విజయనగరం

3. శ్రీ కె. జె. సుందరరావుగారు, B. Sc. B. E. 50—00
అసిస్టెంటు ఇంజనీరు, చీరాల

4. శ్రీ ఐ. వి. రాఘవరావుగారు, B. E. 50—00
అసిస్టెంటు ఇంజనీరు, చీరాల

5. శ్రీ పిన్నమనేని రవివర్మగారు, కస్తల 50—00
ఉపాధ్యాయులు

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R I.
Acc. No.

BCI

AOLA105B132
B2

# కృతికర్త

జననము : 1918 జనవరి 25 వ తేది

తలిదండ్రులు : శేషమ్మ, నారాయణయ్యగార్లు

ఆంధ్రకావ్యపఠనము : పితృపాదులకడ

సంస్కృతకావ్యపఠనము ; శ్రీమాన్ సరికొండ నమ్మాళరాజులవద్ద

ఉన్నత విద్యాభ్యాసము : శ్రీమాన్ శ్రీమత్తిరుమల గుదిమెళ్ళ వరదాచార్యులవారి సన్నిధి బ్రహ్మశ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రులవారికడ.

ఉద్యోగము : 1945 శరభయ్యగుప్త హైస్కూలు
1946 నుండి 1952 వఱకు జిల్లాబోర్డు హైస్కూలు
1952 జులైనుండి నేఁటిదనుక శ్రీ పొన్నూరు భావనారాయణస్వామి సంస్కృత కళాశాల

కవిరాజు కృతులు :

| | |
|---|---|
| 1. కర్షకా | 0–75 |
| 2. దివ్యస్మృతులు | 2–50 |
| 3. నైషధచరిత్ర I | 4–00 |
| 4. నైషధచరిత్ర II | 4–00 |
| 5. త్రిశతి | 2–00 |
| 6. రాజర్షి | 3–50 |

కవిరాజు ముద్రితములు :

| | |
|---|---|
| 1. భావలింగశతకము | 0–75 |
| దార్ల సుందరమ్మ | |
| 2. శబ్దలక్షణసంగ్రహము | 0–75 |
| పరవస్తు చిన్నయసూరి | |
| 3. కీర్తిమాలినీపరిణయము | |
| ముద్రణలో తురగా వేంకటకవి | |

శారదా ప్రెస్, పరాబ్ బజార్ – పొన్నూరు

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B132 |
| పుస్తకం పేరు | మేలుకొలుపు |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 77 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | ci Bci |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | Kethera |
| పేజీలు విడదీసినది | Kethera |
| స్కాన్ చేసినది | Teja |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |